ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 16 మే 2025



ఇంటి దొంగలు దొరికారు

- సుంకొల్లు ఇళ్ల నిర్మాణాల్లో రూ.76 లక్షలు కైంకర్యం
- ఆంధ్రజ్యోతి కథనంతో వెలుగులోకి..
- మంత్రి పార్థసారథి విచారణకు ఆదేశం
- ఐదుగురు అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు.. రికవరీ యాక్ట్ ద్వారా సొమ్ము వసూలుకు నిర్ణయం


ఇంటి దొంగలు దొరికినా
నో యాక్షన్

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

నూజివీడు, మే 15(ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం సుంకొల్లు గ్రామంలో గృహ నిర్మాణ శాఖ అవకతవకలపై రూ.76 లక్షలు నిధులు దుర్వినియోగం అయ్యాయని ఈ నెల ఏడో తేదీన ఆంధ్రజ్యోతి ఇచ్చిన కథనం అక్షర సత్యమని నిరూపణ అయ్యింది. దీనిపై స్పందించిన మంత్రి కొలుసు పార్థసారథి విచారణకు ఆదేశించారు. సదరు విచారణలో 2,450 బస్తాల సిమెంట్, 11,952 కేజీల స్టీల్ లబ్ధిదారులకు అందలేదని నిరూపితమైంది. దీని విలువ రూ.16,52,895లుగా అధికారులు ధ్రువీకరించారు. గృహ నిర్మాణ సంస్థ గోదాముల నుంచి సిమెంట్, స్టీలు విడుదల చేసిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఐదుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లను విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరి నుంచి సదరు మొత్తాన్ని రికవరీ యాక్ట్ ద్వారా వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఏపీ గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి జి.వి.వి.సత్యనారాయణ తెలిపారు. సదరు సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పైన చర్యలకు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

గ్రామంలో ఇళ్లు కట్టకుండానే కట్టినట్లు అధికారులు, నాటి వైసీపీ పాలకపక్షం నేతల సహకారంతో మెటీరియల్‌తోపాటు నగదును డ్రా చేశారు. ఇది ఇంకా వెలుగులోకి రాలేదు. అయితే అధికారులు తొలుత శాఖాపరంగా ఇచ్చిన నివేదికలో 76 లక్షలకు పైగా వుంటుందని లెక్కలు తేల్చారు. వాస్తవ లెక్కలు అధికారుల టేబుల్‌పై ఉన్నా అవి ఎంత మేరకు బయటకు వస్తాయనేది ప్రశ్నార్థకంగానే ఉంది.

నీటిపారుదలకు నిధుల వరద



పశ్చిమ డెల్టాలో వేసవి పనులకు రూ.29.87 కోట్లు

- కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులకు 788 పనులు
- నీటి సంఘాలదే బాధ్యత.. మంత్రి మండలి ఆమోదముద్ర

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ డెల్టా పరిధిలో కాలువలు, డ్రెయిన్‌ల పనులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మంత్రి మండలి ఆమోదముద్ర వేయడంతో వేసవి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఆర్థిక శాఖ సైతం పచ్చజెండా ఊపింది. నీటిసంఘాల ఆధ్వర్యంలో అధికారులు పనులు నిర్వహించనున్నారు, ప్రధానంగా గుర్రపు డెక్క, తూడు తొలగింపు, పూడికతీత పనులను చేపట్టనున్నారు. జిల్లాలో అక్కడక్కడ పనులు ప్రారంభించారు. కాలువల్లో 437 పనులు చేపట్టనున్నారు. అందుకోసం రూ.15.87 కోట్లు వెచ్చించనున్నారు. డ్రెయిన్‌లలో 351 పనులకు రూ.14 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనల్లో తూడు, గుర్రపుడెక్క పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. కాలువలు మూసివేసే సమయానికే ప్రభుత్వం పనులు మంజూరుచేయాలి. ఆర్థికశాఖ నిధులు కేటాయింపునకు అనుమతి ఇవ్వలేదు. దీంతో మంత్రి మండలిలో ఆమోదముద్ర వేశారు. తదుపరి ఆర్థిక శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. పనులు నిర్వహించేందుకు నీటి సంఘాలు కసరత్తు చేస్తున్నాయి. ముఖ్యంగా డ్రోన్‌లతో తూడు, గుర్రపుడెక్కపై మందులను పిచికారీ చేయనున్నారు. తద్వారా పనులు వేగవంతం కానున్నాయి. డ్రెయిన్‌లలో పూడికతీత పనులకు నిధులు కేటాయించారు. గతంలో నీటి సంఘాలు లేవు. కాలువ మొత్తానికి నిధులు మంజూరయ్యేవి. పనులు నిర్వహించేందుకు టెండర్లు పిలిచేవారు. కాంట్రాక్టర్‌ల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉండేది. బిల్లులు మంజూరు కావన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్‌లు వెనుకడుగు వేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం నీటి సంఘాలకు మళ్లీ ప్రాధాన్యం ఇచ్చింది. జిల్లావ్యాప్తంగా నీటి సంఘాలు ఏర్పాటయ్యాయి. ఇప్పుడు సంఘాల సమక్షంలోనే పనులు చేపట్టనున్నారు.

జూన్ నాటికి పూర్తి కావాల్సిందే

కాలువలకు జూన్ మొదటివారంలోనే నీటిని విడుదల చేయనున్నారు. అప్పటిలోగా పూడికతీత పనులు పూర్తిచేయాలి. తూడు, గుర్రపు డెక్క తొలగింపు కోసం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే పనులు చేపట్టడంలో జాప్యం జరిగింది. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూశారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు కోసం ఎదురుతెన్నులు చూడాల్సి వచ్చేది. పనులు చేపట్టిన తర్వాత బిల్లుల కోసం ఎగబడేవారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించేది. కోర్టులను ఆశ్రయించిన వారికే బిల్లులు ఇచ్చే సంస్కృతి వచ్చింది. ఇలా మూడేళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వారికి మాత్రమే గత ప్రభుత్వం బిల్లులు ఇచ్చింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో నీటి సంఘాలే పనులు చేపట్టనున్నాయి. బిల్లులు మంజూరు చేస్తారన్న భరోసా ఏర్పడింది. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం ఒక్కొక్కటిగా విడుదల చేస్తూ వస్తోంది. దీంతో నీటిసంఘాలు సైతం వేసవి పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

కాటన్‌కు ఘన నివాళులు


తెలుగు ప్రజలు సర్ ఆర్థర్ కాటన్ సేవలను ఎన్నటికీ మరిచిపోరని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అపర భగీరథుడు కాటన్ జయంతి సందర్భంగా పాలకొల్లులో కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో పంట భూములకు పూర్తిస్థాయిలో సాగు నీరందిస్తామన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

తరగతులకు ఎందుకు పంపించరు

విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ వెట్రి సెల్వి ఫోన్

ఏలూరు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి):పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులు రెమిడియల్ తరగతులకు హాజరు కాకపోవడంపై కలెక్టర్ వెట్రిసెల్వి ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు స్వయంగా ఫోన్‌చేసి పిల్లలను ఎందుకు పంపించడం లేదని అడిగారు. సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో ప్రత్యేక తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. విద్యార్థులు నూరు శాతం హాజరయ్యేలా హెచ్ఎంలు, టీచర్లు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అంబరీష్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, తహసీల్దార్ శేషగిరి, హెచ్ఎం కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి పార్థసారథి

సమస్యలు చెప్పండి

- పరిష్కారానికి తక్షణ చర్యలు
- చాట్రాయిలో మంత్రి కొలుసు పార్థసారథి ప్రజా దర్బార్

చాట్రాయి, మే 15(ఆంధ్రజ్యోతి): సమస్యలు చెప్పండి.. తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి ప్రజలకు భరోసా ఇచ్చారు. సుదీర్ఘ కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యమన్నారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. భూసమస్యలు, ఇళ్ల స్థలాలు, రోడ్లు, పింఛన్లు తదితర సమస్యలపై అర్జీలను మంత్రి స్వీకరించి తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో రెవెన్యూ, సివిల్, ఫారెస్ట్, విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, పరిష్కారానికి ప్రజాదర్బార్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించే బాధ్యత తనదని, అధికారుల చుట్టూ తిరగకుండా పరిష్కార వేదిక ఏర్పాటు చేశామన్నారు. అధికారులు స్పందించకపోతే నేరుగా తనకు తెలియజేయాలన్నారు. సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ గీత, నాయకులు పాల్గొన్నారు.

బదిలీలకు వేళాయె..

- జూన్ 2 వరకు బదిలీలపై నిషేధం ఎత్తివేత
- 3 నుంచి నిషేధం తిరిగి అమల్లోకి
- 13 జిల్లాల ప్రాతిపదికన ఉత్తర్వులు
- కనీసం రెండేళ్ల సర్వీసు ఉంటే అర్హత

ఏలూరు, మే 15(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఉద్యోగులకు ఊరటనిచ్చేలా ఈ ఏడాది ముందస్తుగానే బదిలీ షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రంలో ఉద్యోగులు బదిలీలకు షెడ్యూల్ విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పియూష్‌కుమార్ మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. ఈ నెల 16 నుంచి జూన్ 2 వరకు బదిలీలపై నిషేధం ఎత్తివేశారు. పాత 13 జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేస్తారు. ఈ ఏడాది మే 31 నాటికి కనీసం రెండేళ్లు సర్వీస్ ఉంటే బదిలీలకు అర్హత పొందుతారు. గరిష్ఠంగా ఐదేళ్ల అయితే తప్పనిసరి బదిలీ చేస్తారు. ఉద్యోగ సంఘ నేతలకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఒకేస్థానంలో తొమ్మిదేళ్లకు పెంపు చేశారు. జూన్ 3 నుంచి మరలా బదిలీలపై నిషేధం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరీక్షలు సీజన్ పూర్తి అయ్యాక, వేసవి సెలవుల్లో బదిలీల షెడ్యూల్ విడుదల కావడంతో ఉద్యోగుల, అధికారులకు తిప్పలు తప్పినట్లే. గత ఏడాది ఆగస్టులో బదిలీలపై నిషేధం అమలు చేయగా, దాన్ని అక్టోబరు వరకు వివిధ శాఖల్లో పొడిగింపులతో చాలా మంది ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది సకాలంలో స్కూళ్ల తెరిచే దాదాపుగా 27 రోజుల ముందుగానే ఉత్తర్వులు ఇవ్వడంతో అధికారులు, ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశం. ఇదిలా ఉండగా త్వరలో ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు ప్రత్యేకంగా విడుదలవుతాయని సమాచారం.


బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు, పాల్గొన్న హెచ్‌సీ, ఏఎస్ఐలు

పోలీసు శాఖలో 91 మంది హెచ్‌సీ, ఏఎస్ఐల బదిలీ

ఏలూరు క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఒకే పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్లకు పైబడి పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలను బదిలీ చేశారు. ఎస్పీ కేపీఎస్.కిశోర్, ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఖాళీలను బట్టి, సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని స్టేషన్ సభ్యులు కాకుండా ఇతర ప్రాంతాలకు స్వచ్ఛందంగా బదిలీలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసిన సిబ్బందికి వారి అభీష్టం మేరకు పట్టణ ప్రాంతాలకు బదిలీ చేసే అవకాశం కల్పించారు. ముఖ్యంగా పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు అదే పోలీస్ స్టేషన్‌లో కొనసాగుతున్న సందర్భంలో వారికి కూడా కోరుకున్న ప్రాంతాలకు కూడా బదిలీ చేశారు. ఎటువంటి సిఫార్సు లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించారు. జిల్లాలో ఏఎస్ఐలు 30 మందికి 29 మంది వచ్చారు. హెడ్ కానిస్టేబుళ్లు 65 మందికి 62 మంది వచ్చారు. మొత్తం 95 మందికి 91 మంది హాజరు కావడంతో వారికి ఈ బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బదిలీ అయిన సిబ్బంది కొత్త స్టేషన్ల పరిధిలో కుటుంబాలతో నివాసం ఉండేలా చూడాలన్నారు. ఇది వారి కుటుంబ జీవితం, విధి నిర్వహణ రెండింటికి సమతుల్యత నిచ్చే అవకాశం కలిగిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి ఆంజనేయరాజు పాల్గొన్నారు.

నేడు కానిస్టేబుళ్లకు..

జిల్లాలో ఒకే పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్లకు పైబడి పనిచేస్తున్న కానిస్టేబుళ్లను పారదర్శకంగా బదిలీ చేయనున్నారు. శుక్రవారం కౌన్సెలింగ్ ఉంటుంది. ఇప్పటికే బదిలీకి అర్హత ఉన్నవారికి సమాచారం ఇచ్చి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆదేశించారు.


ఈ-ఆడిట్ శిక్షణలో ఆడిటర్లు, జిల్లా అధికారులు

సహకార సంఘాల్లో ఈ-ఆడిట్

- ఆడిటర్లు, సహకార అధికారులకు ఒక రోజు శిక్షణ పూర్తి
- వారం రోజుల్లో ఆడిటింగ్
- విధి విధానాల రూపకల్పన
- అక్రమాలకు చరమగీతం

ఏలూరు, మే 15(ఆంధ్రజ్యోతి):సహకార సంఘాల కంప్యూటరీకరణతోపాటు ఈ-ఆడిట్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతీ సొసైటీలో లావాదేవీలను ఆన్‌లైన్ పద్ధతిలో ఆడిట్ చేసే ప్రక్రియను ఈ వారంలో ప్రారంభించనున్నారు. ఆన్‌లైన్‌లోనే ఆడిటర్ల లాగిన్‌తో క్షుణంగా ప్రతీ వోచరు, రసీదు, ఇతర పత్రాలను పరిశీలించి ఆడిట్ చేస్తారు. జిల్లాలోని 158 సహకార సంఘాల్లో రూ.12 కోట్లతో కంప్యూటరీకరణ చేపట్టారు. ఇప్పటికి 154 సంఘాల కంప్యూటరీకరణ పూర్తి కాగా పూళ్ల, మక్కినవారిగూడెం, పెదపాడు, కామవరపుకోట సొసైటీల్లో ఈ వారంలో పూర్తి కానుంది.

సెక్షన్ 50 సవరణతో ఈ-ఆడిటింగ్

జిల్లాలోని 80 సహకార సంఘాల్లో శాఖాపరమైన అధికారులు, 78 సంఘాల్లో చార్టర్డు అక్కౌంటెట్లు ఆడిటింగ్ చేస్తున్నారు. ఏటా జూన్ నెలాఖరుకు ఆడిటింగ్ పూర్తి చేసి సహకారశాఖాధికారులకు పంపేవారు. మాన్యువల్ విధానంలో జరగడంలో హడావుడిగా అరకొర వోచర్లు, ఇతర పత్రాలను చెక్ చేసి ఆడిటింగ్ చేసేవారు. దీంతో జాప్యం చోటుచేసుకోవడంతో పాటు అక్రమాలకు కళ్లెం వేసే అవకాశం ఉండేది కాదు. సొసైటీల కంప్యూటరీకరణ నేపథ్యంలో ఈ-ఆడిటింగ్ విధానం చేపట్టేందుకు సహకార చట్టంలో 50కు సవరణలు చేశారు.

ఒకరోజు శిక్షణ పూర్తి

ఈ-ఆడిటింగ్ విధానంపై ఆడిటర్లకు సహకారశాఖ శిక్షణాలయం ప్రిన్సిపాల్ కేశవకుమారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) కార్యాలయంలో గురువారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. డీసీవో శ్రీనివాస్, డీసీసీబీ సీఈవో పి.సింహాచలం పర్యవేక్షించారు. ఆడిట్ అధికారుల ఫోన్ నెంబర్లు ఆధార్‌కు అనుసంధానం చేయనున్నారు. ఈఆర్‌పీ మాడ్యూల్స్‌ను రూపొందించారు. ప్రతీ లావాదేవికి ఆడిట్ చేసే అధికారికి ఫోన్ ఓటిపి రావడంతో కంప్యూటరీకరించిన డేటా చెక్ చేసి ఆడిట్ చేయనున్నారు. జవాబుదారీతనంతో పాటు పారదర్శకంగా లావాదేవీల లెక్కలు తేలనున్నాయని అధికారులు భావిస్తున్నారు.

మామిడిపై పండు ఈగ దాడి

30 శాతం పంట నష్టం.. కుదేలైన రైతులు

అక్రమార్కులపై విజి'లెన్స్'

రేషన్ బియ్యం తరలింపుపై నిఘా
ఎరువులు, పురుగు మందుల దుకాణాలు తనిఖీ
వివిధ దుకాణాలు, ఆహార విక్రయాలపై డేగ కన్ను

కొల్లేరు పరిరక్షణపై జడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష

లోపలి పేజీలో


కుక్కునూరు మండలం గణపవరం రెవెన్యూ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకం, ట్రాక్టర్‌పై ఎగుమతి

లోడు వెయ్యి

- రూ.వెయ్యి కొడితే ట్రిప్ వేస్తారు
- గ్రావెల్ అక్రమ తవ్వకం
- కుక్కునూరు మండలంలో దందా
- పట్టించుకోని అధికారులు

కుక్కునూరు, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.వెయ్యి కొడితే గ్రావెల్ లోడు వచ్చేస్తుంది. అక్రమార్కులు యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలతో వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి వ్యాపారం చేస్తే కేసులు, కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఈ నెల 8న కుక్కునూరులో జరిగిన సభలో హెచ్చరించారు. అక్రమార్కులు బేఖాతరంటే.. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గణపవరం రెవెన్యూ పరిధిలో గురువారం ఎక్స్‌వేటర్లతో గ్రావెల్‌తవ్వి ట్రాక్టర్లలో లోడు చేస్తున్నారు. అవసరమైన వారికి ట్రిప్ రూ.వెయ్యికి అమ్మేస్తున్నారు. అల్లిగూడెం, పెదరావిగూడెం, గణపవరం, ఇబ్రహీంపేట, మెట్టగూడెం, తదితర ప్రాంతాల్లో నర్సరీల్లోకి రహదారికి గ్రావెల్ వినియోగిస్తున్నారు. గుంపెనగూడెం, గణపవరం గ్రావెల్ నిరాటంకంగా తరలిపోతోంది. ఓవైపు ప్రజాప్రతినిధులు హెచ్చరించినా అక్రమార్కులు ఆగడం లేదు. అధికారులు స్పందించి ప్రజల అవసరాలను గుర్తించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర సీఆర్‌పీఎఫ్ ఐజీ విక్రమ్

ద్వారకాతిరుమల, మే 15 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని ఆలయాన్ని ఏపీ సీఆర్‌పీఎఫ్ ఐజీ విక్రమ్ తుంబళ్ల గురువారం సందర్శించారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు వేదాశీర్వచనం ఇవ్వగా డిప్యూటీ ఈవో బాబూరావు స్వామి వారి మెమెంటో అందజేశారు. ఆయనతో భీమడోలు సీఐ జెయు విల్సన్ పాల్గొన్నారు.



ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న అర్చకులు



పూలతో అలంకరించిన మండపం.. ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కాళ్లకూరు వెంకన్నకు పవళింపు సేవ

కాళ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకూరులో కొలువైన స్వయంభూ వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఆఖరి రోజైన గురువారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పుష్ప యాగోత్సవం (పవళింపు సేవ) నిర్వహించారు.స్వామివారికి ద్వాదశ భోగములు (12 ప్రసాదాలు) సమర్పించారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో కుంకుమ భరిణిలు, జాకెట్ ముక్కలు అందించారు. ఈవో అరుణ్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

బాలత్రిపుర సుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

భీమవరం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : బాలత్రిపుర సుందరి అమ్మవారికి 100 కేజీల పులిహోర నైవేద్యం అందించారు. భీమవరం మెంటేవారి తోటలోని బాలత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు, దాతల సహకారంతో అమ్మవారికి 100 కేజీల పులిహోర నివేదన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రసాద వితరణ నిర్వహించారు.



అమ్మవారికి పులిహోర నివేదన



బస్సులో కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలకు వెళ్తున్న భక్తులు

సరస్వతి పుష్కరాలకు స్పెషల్ బస్సు

తాడేపల్లిగూడెం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో ఈనెల 15న ప్రారంభమైన పవిత్ర సరస్వతి నది పుష్కరాలకు తాడేపల్లిగూడెం ఆర్టీసి డిపో నుంచి స్పెషల్ బస్సును గురువారం డీపో మేనేజర్ సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ బస్సు వరంగల్ భద్రకాళి మాత ఆలయ దర్శనం, వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారి దర్శనం, కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం, ధర్మపురి లక్ష్మినరసింహస్వామి సందర్శనం చేసుకుని మరుసటిరోజు కాళేశ్వరం చేరి కాళేశ్వరం మహా కాళేశ్వరస్వామి దర్శనం, అనంతరం పవిత్ర పుష్కర స్నానం ఉంటుందని డిపో మేనేజర్ తెలిపారు. అనంతరం రామప్ప ఆలయ దర్శనం తరువాత 18వ తేదీ తెల్లవారుజామున తాడేపల్లిగూడెం చేరుకుంటుందని వివరించారు. ఈనెల 20వ తేదీన కూడా సరస్వతి పుష్కర యాత్ర స్పెషల్ బస్సు ఉంటుందని ఒక్కో టికెట్ రూ.2100 అని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆనంద స్త్రీ పురస్కారాలు

భీమవరం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్ధరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత ఉద్ధరాజు వెంకటలక్ష్మీ నరసయ్య 50వ వర్ధంతి సందర్భంగా ఈనెల 16న ఆనంద స్త్రీ పురస్కారాలు-25 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ ఉద్ధరాజు కాశీ విశ్వనాథరాజు, కంతేటి వెంకట్రాజు, దాయన చంద్రాజీ, రఘుపతిరాజు తెలిపారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయాం అస్మి సతీమణి హీనా తక్, మాజీ ఎంపీ బాపిరాజు సతీమణి కనుమూరి అన్నపూర్ణ, ప్రముఖ సంగీత విద్వాంసురాలు డాక్టర్ కొల్లూరి వందన (తిరుపతి), జిల్లా వైద్య అధికారిణి గీతాబాయి, పోలీసు శాఖ, ఆనంద గ్రూప్‌కు చెందిన ఆరుగురికి, 50 మంది మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులకు అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తమ పిల్లలు డాక్టరో, ఇంజనీరో కావాలనే తాపత్రయంలో తల్లిదండ్రులు వారి మనో వికాసానికి బాటలు వేయడం లేదు.. దీనికి స్కూల్ యాజమాన్యాలు కూడా తోడవుతున్నాయి. పిల్లల ఉన్నత జీవితానికి ఆరోగ్య వంతంగా ఉండాలని వారిని స్వేచ్ఛగా ఆడుకోవ్వాలనే ఆలోచన ఏ తల్లి, తండ్రి చేయడం లేదు. ఒకప్పుడు స్కూళ్లకు సెలవులొస్తే పిల్లలందరూ ఆటస్థలాల్లో ప్రత్యక్షమయ్యేవారు. ఆట,పాటలతో రోజంతా సరదగా ఉల్లాసంగా గడిపేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఆటస్థలాల్లో ఆడుకొనే పిల్లలే కనిపించడం లేదు. కాస్త ఖాళీ దొరికితే సెల్‌ఫోన్లలో మునిగితేలుతున్నారు...



ఆడుకోనిద్దాం !

ఆటలకు దూరమవుతున్న బాలలు
ఖాళీ దొరికితే స్మార్ట్ ఫోన్లకే అంకితం
పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు
శారీరక , మానసిక దృఢత్వం కోల్పోతున్న పిల్లలు
ఆన్‌లైన్ గేమ్‌లతో మానసిక రుగ్మతలు

నిడమర్రు మే 15 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ ఫోన్ల పుణ్యమా అని ఆటలు ఆడే పిల్లల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతున్నది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటస్థలంలో ఆడుతూ చెమటోడ్చి ఇంటికి చేరే పిల్లలు నేడు కనబడడం లేదు. దీనికి తోడు వ్యాయామ పీరియడ్ అంటే కేవలం తమకు అదనంగా పాఠం చెప్పుకోవ డానికి ఉపయోగపడే పీరియడ్‌గానే ఉపాధ్యాయులు భావిస్తున్నారే తప్ప పిల్లల మానసిక ఉల్లాసానికి వ్యాయామ విద్య అత్యవసరమని ఉపాధ్యాయులు భావించడం లేదు. తమ పాఠశాలలో వ్యాయామ విద్యకు పిరియడ్లు కేటాయింపు మొక్కుబడిగా కేటాయించి ఆ సమయంలో ఇతర సబ్జెక్టుల బోధనకు వాడుకొంటున్నారు. వ్యాయామవిద్య పిరియడ్‌లలో ఖచ్చితంగా పిల్లలను ఆటలాడించే ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలలు నేడు వేళ్ళ తో లెక్కపెట్టవచ్చు.



విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం, ఉపాధ్యాయుల ఉదాసీనత, తల్లిదండ్రుల నిర్లక్ష ధోరణి పిల్లల వికాసానికి శాపంగా మారుతోంది. విద్యార్థుల చేతిలో పుస్తకం కనుమరుగై స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లతో కనిపిస్తున్నారు. నేటి విద్యార్థులకు ఆటలంటే వీడియో గేమ్స్ మాత్రమే తెలుసు. ఆటస్థలంలో ఆడే ఆటలను మరిచిపోయే పరిస్థితి నేటి విద్యా రంగం కల్పిస్తోంది. చిన్ననాటి నుంచి లేని ఆటల అలవాటు పెద్దయ్యాక ఎక్కడ నుంచి వస్తుంది.

క్షణం తీరికలేని చదువులు

పాఠశాల , కళాశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలకు క్షణం తీరిక కూడా ఉండడం లేదు. ఇంటికి వచ్చింది మొదలు మ్యాథ్స్, సైన్స్, ఫిజిక్స్, క్రెమిస్ట్రీ ట్యూషన్లు , కోచింగ్ అంటూ తల్లిదండ్రులు నలిపేస్తున్నారు. గంటో, అరగంటో ఖాళీ దొరికితే స్మార్ట్ ఫోన్లు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారే గానీ వ్యాయామం ముఖం మాత్రం చూడడం లేదు. వేసవి కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆటలపట్ల మక్కువ పెంచేలా చర్యలు తీసుకోవాలి. ఆట, పాటలే ఆటవిడుపుగా సెలవులు గడిపేలా పిల్లలను ప్రోత్సహించాలి. జిల్లా కేంద్రాల్లో, పట్టణాల్లో వేసవి శిక్షణా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. వాటిని సద్వినియోగం చేసుకొనేలా పిల్లలకు శిక్షణ ఇవ్వాలి. సీనియర్ క్రీడాకారులు ఆధ్వర్యంలో బాల, బాలికలకు క్రికెట్, కరాటే, వాలీబాల్, షటిల్ వంటి క్రీడాంశాలలో శిక్షణ అందివ్వాలి. అప్పుడే వారిలో గల నైపుణ్యాలు బయటకు వస్తాయి. మనోవికాసం వృద్ధి చెందుతుంది.

అనారోగ్య సమస్యలు

చిన్నతనంలో పిల్లలను ఆటలకు దూరం చేయడం వల్ల అనేక శారీరక, మానసిక సమస్యలకు బలవుతున్నారు. ముఖ్యంగా వ్యాయామం లేని పిల్లలకు చర్మ సంబంధమైన, కంటి సంబంధమైన రోగాలుకు గురివుతున్నారు. ఆటలు ఆడకపోవడంతో నడుం , వెన్నుపూసలు వృద్ధి చెందక అనేక సమస్యలకు గురై నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆటలు ద్వారా వచ్చే క్రీడాస్ఫూర్తిని పిల్లలు అలవరుచుకోలేక పోతున్నారు. ఓటమి, గెలుపును సమానంగా స్వీకరించే మానసిక పరివర్తన పెంపొందించ బడడం లేదు.

ఆటల ద్వారా ఉన్నత శిఖరాలకు..



నేటి పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటల వైపు వెళ్లనీయడం లేదు. ఆటస్థలాలకు వెళితే పిల్లల టైం వేస్ట్ అవుతుందని భావిస్తున్నారు. ఆరోగ్యవంతులైన విద్యార్థి జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అందుకోగలడు. ఆటల ద్వారా గెలుపోటములను సమానంగా స్వీకరించగల సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు. క్రీడా స్ఫూర్తి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ పెంపొందుతుంది. అందువల్ల ప్రతి విద్యార్థి రోజులో ఒక గంట సమయమైనా ఆటలకు కేటాయించాలి. చిన్నారులు మానసికంగా, శారీకంగా ధృడంగా ఉంచడానికి క్రీడలు తప్పనిసరి. శారీరక శ్రమలేక పోవడం వల్లే పిల్లల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

డాక్టర్ శ్రావణరెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెదనింద్రకొలను

ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ తగినంత సమయం కేటాయించాలి. సంప్రదాయ క్రీడలతో పాటు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల పిల్లలకు ఆరోగ్యంతో పాటు శరీర సౌష్టవం ఏర్పడుతుంది. ముఖ్యంగా బాలికల ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుంది. కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగు తుంది. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. అందుకోసం చిన్ననాటి నుంచే ఏదో ఒక క్రీడాంశంలో శిక్షణ ఇవ్వడం అవసరం.

బేతు దుర్గా సూర్య ప్రకాష్ , కరాటే మాస్టర్, భువ్వనపల్లి

---

19 కాదు..29 ఎకరాలు

నరసాపురం సెంట్రల్ బ్యాంకులో లీజు అగ్రిమెంట్ పేరిట మోసం
ఆపై మూడు కోట్ల రుణాలు
ఇప్పటికే రెండుసార్లు విచారణ..
సెలవులో బ్యాంకు మేనేజర్



నరసాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): నరసాపురం సెంట్రల్ బ్యాంకులో రైతులకు తెలియకుండా లీజు అగ్రిమెంట్ సృష్టించి రుణం తీసుకున్న స్కాంలో కొత్త ట్విస్టులు వెలుగు చూస్తున్నాయి. మొదట 19 ఎకరాలు పెట్టి రుణం తీసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. బ్యాంకు అధికారుల విచారణలో 19 కాదు.. 29 ఎకరాలని తేల్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉన్నతాధికారులు రెండుసార్లు విచారణ చేపట్టి కీలక డాక్యుమెంట్లను తీసుకెళ్లారు. మరోవైపు బ్యాంకులో ఈ తరహా రుణాల స్కాంలు ఇంకా ఏమైనా ఉన్నాయా ? అన్నదానిపైన ఆరా తీస్తున్నారు. బ్యాంకు మేనేజర్ ప్రకాశం సెలవులో ఉన్నారు. రుణం ఇప్పించిన బ్రోకర్ పరారీలో ఉన్నాడు. మోసపోయిన రైతు తిరుమాని నాగరాజు ఆయన సోదరుడు శ్రీనివాస్ పోలీస్ కేసు పెట్టలేదు. బయట రాజీ చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఈ నెల 6న బ్యాంకులో రైతులకు తెలియకుండా లీజు అగ్రిమెంట్లు సృష్టించి పట్టణానికి చెందిన ఇద్దరు రూ.3 కోట్లపైనే రుణం తీసుకున్నారు. బాధిత రైతులు రుణం కోసం మరో బ్యాంకుకు వెళ్లగా.. మీ పొలాలు రుణంపై ఉన్నాయని చెప్పడంతో షాక్ తిన్నారు. వెంటనే సెంట్రల్ బ్యాంకుకు వచ్చి నిలదీయడంతో అసలు విషయం బయట పడింది. మొదట 19 ఎకరాలేనని భావించారు. విచారణలో మరో 10 ఎకరాలకు పెరిగింది. బ్యాంకు ఉన్నతాధికారులు లోతైనా విచారణ చేస్తున్నప్పటికీ విషయాలను బయటకు వెల్లడించడం లేదు. ఈ ప్రాంతంలో ఈ కుంభకోణం చర్చనీయాంశమైంది. రుణం పొందిన కూనపరెడ్డి ప్రసాద్, డి.చంద్రశేఖర్ తీసుకున్న రుణానికి సమానంగా ఆస్తుల డాక్యుమెంట్లను బ్యాంకుకు సమర్పించారు. తక్కువ వడ్డీతో వ్యవసాయ రుణం కోసం బ్రోకర్‌ను ఆశ్రయించి ఇరుక్కుపోయారు. వీరికి రుణం ఇప్పించినా బ్రోకర్‌పై ఇప్పటికే ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని కొందరు బ్యాంకు మేనేజర్లను గుప్పెట్లో పెట్టుకుని ఈ తరహా రుణాలను ఇప్పించి భారీగా కమీషన్లు దండుకుంటాడన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి. బాధితులు పోలీసు కేసు పెట్టకపోవడంతో బ్రోకర్‌ను పట్టుకుని విచారించే అవకాశం లేకపోయింది. ఇదే జరిగితే ఈ బ్రోకర్ ద్వారా రుణాలు పొందిన మరికొందరి పేర్లు వెలుగులోకి వచ్చేవన్న వాదనలు వినిపిస్తున్నాయి.

శుభ్రతతో డెంగీకి చెక్



ఏడిస్ దోమ ద్వారా డెంగీ జ్వరం
తీవ్రమైతే ప్రాణాలకు ప్రమాదం
ప్రజల్లో అవగాహనకు ఆరోగ్య శాఖ చర్యలు
నేడు జాతీయ డెంగీ దినోత్సవం

జంగారెడ్డిగూడెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు డెంగీ జ్వరం వర్షాకాలంలోనే వ్యాపించేది. కానీ నేడు అన్ని కాలాల్లో ప్రజలు డెంగ్యూ వైరస్ బారిన పడుతూనే ఉన్నారు. ఈ వ్యాధి ప్రధానంగా ఏడిస్ అనే ఆడ దోమ కుట్టడం ద్వారా సంక్రమిస్తుంది. డెంగీ వైరస్ సోకిన వారికి వెంటనే లక్షణాలు కనిపించవు. వ్యాధి లక్షణాలను బట్టి మాత్రమే డెంగీ జ్వరంగా గుర్తించి వెంటనే వైద్యం అందించక పోతే ప్రాణాపాయ స్థితికి వెళ్ళే అవకాశాలు ఉన్నాయి. భారత ఆరోగ్య, కుటంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతీ సంవత్సరం మే 16న జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది చెక్-క్లీన్-రిమూవ్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారు. 2024లో ఏలూరు జిల్లా వ్యాప్తంగా 216 డెంగీ కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు మాత్రమే గిరిజన ప్రాతాల్లో నమోదయ్యాయి. 2025లో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 12 కేసులు నమోదయ్యాయి.

ఏడిస్ అనే దోమ కుట్టడం వల్ల వైరస్ సోకి డెంగీ జ్వరం వస్తుంది. ఈ జ్వరం రాగానే కొందరిలో వెంటనే లక్షణాలు కనిపిస్తాయి. మరి కొందరిలో రెండు నుంచి ఐదు రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రస్థాయిలో జ్వరం, జాయింట్ పెయిన్స్, తలనొప్పి, కళ్ల నొప్పి, శరీరంపై దద్దుర్లు, ఎర్రటి మచ్చలు, తీవ్రంగా అలసట ఉంటుంది. వ్యాధి తీవ్రమైతే రక్తంలో ప్లేట్‌లెట్‌ల సంఖ్య పడిపోవడం, రక్తస్రావం, శరీరం నుంచి నీరు లీక్ అవడం, శ్వాస సరిగా అందకపోవడం, అవయవాల పని తీరు తగ్గడం వంటివి ఈ వైరస్ సోకిన వారిలో కనిపిస్తాయి. వ్యాధి తీవ్రతను బట్టి వెంటనే ఆసుపత్రిలో చేరి వైద్యం పొందాలి.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



తీవ్ర జ్వరం, ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గిపోవడం, దగ్గు, జలుబు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్ళి చికిత్స పొందాలి. ఈ వైరస్ సోకకుండా ఉండాలంటే నివారణ ఒక్కటే మార్గం. దోమలు నుంచి రక్షణ పొందే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. ఇంటిచుట్టూ నీటిని నిల్వ లేకుండా చూసు కోవాలి. నీటి తొట్టెల్లో నీటిని పరి శుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నెట్, దోమల క్రీమ్‌లు వాడాలి. ఆరోగ్య కరమైన జీవితం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

డాక్టర్ మల్లేశ్రా జల్లి, మమత ఆసుపత్రి, జంగారెడ్డిగూడెం.

ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలంలో ఏడిస్ దోమలు వ్యాప్తి చెంది ప్రజలను కుట్టడం వల్ల ఈ వైరస్ బారిన పడుతున్నారు. వైద్యఆరోగ్య శాఖ ఆధ్వ ర్యంలో చర్యలు చేపడుతున్నాం. ప్రతీ శుక్ర వారం ఏఎన్ఎం, ఆశ వర్కర్‌లతో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. నీటి నిల్వలు ఉన్నచోట దోమలు లార్వాను విడిచి పెడతాయి. అక్కడి నుంచి దోమలు వ్యాప్తి చెందుతాయి. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని ఇంటింటికీ వెళ్ళి అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కువగా నీరు నిల్వ ఉండి తొలగించ లేని పరిస్థితుల్లో ఆ నీటిలో గంబూషియా చేపలు విడిచిపెడుతున్నాం. ఇవి నీటిలో దోమల లార్వాను పెరగనీయ కుండా ఎప్పటికప్పుడు తినివేస్తాయి. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి, ఏలూరు



ఏజెన్సీ ప్రాంతంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

మామిడిపై పండు ఈగ దాడి

దీనివల్లే 30 శాతం పంట నష్టం
కొనేవారు లేక కుదేలైన రైతులు
ప్రతికూల వాతావరణంతో మరింత నష్టం

నూజివీడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మేడిపండు చూడ మేలిమై ఉండు, పొట్టవిప్పి చూడ పురుగులుండు అన్నచందాన ప్రస్తుతం మామిడి పరిస్థితి తయారైంది. కొన్ని సంవత్సరాల క్రితం థైవాన్ జామద్వారా వ్యాప్తి చెందిన పండు ఈగ దెబ్బకి థైవాన్ జామ తోటలు మాయం కాగా గతేడాది నుంచి మామిడి పండుపై ఈ పండు ఈగ దాడితో మామిడి రైతులు కునారిల్లుతున్నారు. మామిడి కాయ చెట్టుపై తయారైన తరువాత ఈ ఈగ దాడితో ఇటు మామిడి రైతుకు, అటు కొనుగోలు దారులకు తీవ్రనష్టం జరుగుతోంది. ఈ పండు ఈగ థైవాన్ జామ, మామిడిపైనే కాదు, బొప్పాయి, సపోట, అరటి, సీతాఫలం, సిట్రెస్ ఫలాలు పైన, అలాగే పొట్ల, బీర, సొర, కాకర కాయవంటి కూరగాయలను సైతం ఆశిస్తూ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఈ పురుగు ఆశించిన ఏ పంట, కూరగాయ అయినా పైకి చూడటానికి బాగానే ఉంటుంది. వాటిని కొన్నప్పుడే లోపల పురుగులు కనిపిస్తాయి.

కాయపై దాడి ఇలా..

మామిడిచెట్టుపై మామిడి పండు తయారు కాగానే ఈ పండు ఈగ కాయపై వాలి తన వెనుక భాగాన ఉన్న ఒక ముల్లువంటి భాగాన్ని కాయలోకి చొప్పించి ఒకేసారి రూ.500 వరకు గుడ్లు పెడుతుంది. కాయపై పరీక్షగా చూస్తానే తప్ప ఈ ఈగ పెట్టిన సన్నని రంధ్రాలు కని పించవు. సాధారణ ఉష్ణోగ్రతలో మామిడి కాయలోకి వెళ్ళిన గుడ్లు ఒక్కరోజులోనే పగిలి చాలా చిన్నచిన్న పురుగులుగా బయట పడ తాయి. ఈ కాయలోని తీపి కండపదార్థాన్ని తిని పెరిగి బియ్యం గింజలు లాగా తయారవుతాయి. అవి విసర్జించే మలిన పదార్థాలపై కాయపై పెట్టిన సన్నని రంధ్రాల ద్వారా బయట నుంచి శిలీంధ్రాలు కాయలోనికి ప్రవేశించి కాయను కుళ్లి మెత్తబడేటట్లు చేస్తాయి. ఈ పురుగులు కాయలో లార్వాలుగా వృద్ధి చెందు తాయి. పండు పూర్తిగా చెడిపోయి చెట్టు నుంచి నేలపై పడటం ద్వారాను, కాయ మార్కెట్లోకి వెళ్ళినప్పుడు వినియోగదారుడు కొని ఉపయోగించటానికి ప్రయత్నించినప్పుడు లోన పురుగులు కనిపించి బయట పారేయడంతో అక్కడ ఇవి లార్వాలుగా మారి భూమిపై చేరి పది, 12 రోజుల్లో తిరిగి అవి ఈగలుగా మారతాయి. ఈ ఈగలు ఆడ, మగ సంపర్కం జరిపి మళ్ళీ ఆడ ఈగలు మామిడి కాయలు లేదా కూరగాయల పై చేరి గుడ్లు పెడుతూ తన సంతతిని వృద్ధి చెందిస్తాయి. 40 నుంచి 50 రోజుల్లో తన జీవిత చక్రంను పూర్తి చేసుకుని రైతులు పుట్టుముం చుతున్నాయి. ఈ పండు ఈగ 50 నుంచి 100 కిమీ వరకు పయనిస్తూ తన విధ్వంసాన్ని కొనసాగిస్తోంది. ఈ పురుగు ఆశించిన మామిడి పండ్లు వేరే ప్రాంతాలకు వెళ్ళినప్పుడు అక్కడ కూడా అవి తన సంతతిని వృద్ధిచేస్తూ అపార నష్టం కలిగిస్తుంటాయి. గత పదిరోజుల నుంచి అకాల వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మామిడి పంటకు తీవ్రనష్టం జరుగుతోంది. దానికితోడు ఈ ఈగ ఆశించడంతో చెట్లు పసుపురంగు వచ్చి చెట్టు నుంచి కిందపడి పోతున్నాయి. మార్కెట్లో మామిడి కాయలను కొనే పరిస్థితి కనిపించడం లేదు.



ప్రభుత్వం దృష్టి సారించాలి

మామిడి ఎదుర్కొంటున్న ఈ పరిస్థితి ఒక్క నూజివీడు ప్రాంతంలోనే కాదు. మామిడి పంట పండుతున్న ప్రతి ప్రాంతంలోనూ ఈ పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు ఈ పంట ఇతర పండ్లు, పండ్ల రకాలకు, కూరగాయలకు సైతం సోకుతూ రైతులను ఆందోళన పరుస్తోంది.వీటి నివారణకు శాస్త్రవేత్తలు వలలు సూచించారు. అయితే ఈ వలలో కేవలం మొగ ఈగ మాత్రమే పడుతుంది. ఆడ ఈగలు ఈ వలలోకి రావని స్పష్టంగా తేలింది. దానివల్ల ఈగను అదుపుచేయడం సాధ్యం కావడం లేదు. అలాగే మామిడి కాయపైన కవర్లు చుట్టమని సూచిం చారు. మామిడి చెట్టుపై ఉన్న కాయలు అన్నింటికి ఈ కవర్లు తొడగడం సాధ్యం కాదు.



కాయల రక్షణకు కవర్ తొడిగిన దృశ్యం

మామిడి పరిశోధనా కేంద్రాన్ని ఉపయోగించాలి

నూజివీడులో ఉన్న మామిడి పరిశోధనా కేంద్రానికి వెంటనే భూమి కేటాయించి మామిడి పై వస్తున్న ఇబ్బందులపైన, ఈ పండు ఈగ అరికట్టే విధానంపైన త్వరితగతిన పరిశోధనలు చేయించాలి.ఇప్పటికే వేలాది ఎకరాల తోటలను తొలగిస్తున్నారు. ఈ ఏడాది ఈ పండు ఈగ దెబ్బకు పరిస్థితి పూర్తిగా తలకిందలు కావడంతో మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ప్రభుత్వం ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మామిడి పంటను పరి రక్షించే విధంపై దృష్టి సారించాలని మామిడి రైతులు కోరుతున్నారు.

ఈసెట్‌లో గంగాభవానికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు

ఏలూరు జిల్లాలో 91.48 శాతం అర్హత..

పశ్చిమలో 94.6 శాతం

ఏలూరు అర్బన్/ భీమవరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : డిప్లొమా హోల్డర్లు, బీఎస్సీ (గణితం) ఉత్తీర్ణులు నేరుగా ద్వితీయ సంవత్సరం ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశించేందుకు అర్హతా పరీక్షగా ఈ నెల 6న నిర్వహించిన ఏపీ ఈసెట్-2025 పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఏలూరు జిల్లాలో ఈ పరీక్షకు మొత్తం 670 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 657 మంది హాజరయ్యారు. వీరిలో 432 మంది పురుషులు, 169 మంది మహిళలు కలిపి మొత్తం 601 మంది (91.48 శాతం) అర్హత సాధించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 94.6 శాతం విద్యార్థులు అర్హత సాధించారు. జిల్లా నుంచి 1676 మంది విద్యార్థులు ఈసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంపైన 1649 మంది పరీక్షలు రాశారు. అందులో 1551 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. పరీక్ష రాసిన విద్యార్థుల్లో 1030 మంది, విద్యార్థినుల్లో 521 మంది అర్హత సాధించిన వారిలో ఉన్నారు.

ఐటీ సెక్టార్‌లో ఉద్యోగం సాధించాలి..



ఆకివీడు రూరల్ మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలం తరటావ గ్రామానికి చెందిన కె.గంగా భవాని ఈసెట్‌లో రాష్ట్ర ఫస్ట్‌ర్యాంకు సాధించింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు తరటావ ప్రాథమిక పాఠశాల, 6నుంచి 10వ తరగతి వరకు చినకాపవరంలోని జడ్పీ పాఠశాలలో 9.8 గ్రేడ్, హనుమాన్ జంక్షన్‌లోని ప్రవేటు కాలేజీలో ఇంటర్మీడియట్, ఏలూరులోని ప్రైవేటు కాలేజీలో బీఎస్సీ పూర్తి చేసింది. తల్లిదండ్రులు కొట్టి కాశీ విశ్వనాథం,. దనలక్ష్మీ దంపతులు రోజువారీ కూలీలు. ఇంజనీరింగ్ పూర్తి చేసి ఐటీ సెక్టార్‌లో ఉద్యోగం సాధించాలని ఆశయమని తెలిపింది. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన గంగాభవానీని గ్రామపెద్దలు, పలువురు అభినందించారు.



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

17 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

ఏలూరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): అంబికా సంస్థల వ్యవస్థాపకుడు ఆలపాటి రామచంద్రరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా అంబికాసంస్థలు, హిందూ యువజన సంఘం, హేలాపురి కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 17,18,19,20 తేదీలలో జాతీయస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అంబికా సంస్థల చైర్మెన్ అంబికా కృష్ణ, వైఎం హెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమ లింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్య నారాయణ తెలిపారు. పోటీలకు సంబ ంధించి గురువారం సాయంత్రం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ప్రతిరోజూ సాయ ంత్రం ఆరు గంటలకు పోటీలు ప్రారంభమవుతాయ న్నారు. 17న అనస్వరం, విడాకులు కావాలి, 18న అమ్మ చెక్కిన బొమ్మ, ద్వార బందాల స్వామి నాయుడు, 19న నాశత్రువు, వర్క్‌ఫ్రం హోం, 20 జనరల్ బోగీ, రుతువు లేనికాలం నాటికలు ప్రదర్శిస్తామని తెలిపారు. సంస్థ గౌరవ ఆహ్వానితులు వేణుగోపాల్ లునాని, సభ్యులు పార్వతీ రామచంద్రన్, హను మంతరావు, మురళీకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంలో లోపాలు సరి చేయాలి

చీఫ్ సెక్రటరీకి రెవెన్యూ సంఘం వినతి



ఏలూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి) : రేషనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానంలో లోపాలు సరిచేయాలని కోరుతూ ఉమ్మడి పశ్చిమకు చెందిన రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ విజయవాడ క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్ చేయడం సరికాదన్నారు. దీని వల్ల భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సంబంధిత విషయాలు గ్రామాల్లో అనేక సమస్యలున్నాయన్నారు. మండలాల్లో తహసీల్దార్లను కూడా సంప్రదించకుండా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చేస్తున్న ఈ అసంబద్ధ క్లస్టర్ విధానం వల్ల ఎక్కడి భూ సమస్యలు అక్కడే ఉంటున్నాయన్నారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్లు కల్పించాలని, గ్రేడ్ 2 వీఆర్వోలకు వెంటనే గ్రేడ్ 1 ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొల్లేరులో ఆక్రమణలు తొలగించాలి

అధికారులకు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచన

ఏలూరుసిటీ, మే 15(ఆంధ్రజ్యోతి) : కొల్లేరు పరిసరాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం ఏలూరు జడ్పీ కార్యాలయంలో సంబంధిత అధి కారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో డివి జనల్ ఫారెస్టు అధికారి బి.విజయ, డ్రైన్స్ శాఖా ధికారులు పాల్గొన్నారు. కొల్లేరు సరస్సు పరిరక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా సర్వే కొనసాగుతోంది. ఈ సర్వే ద్వారా సరస్సు అసలు పరిస్థితి, ఆక్రమణ స్థలాలు, మానవీయ జోక్యాల కారణంగా ఏర్పడిన మార్పులు బయటపడతాయన్నారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ కొల్లేరు సరస్సు మన రాష్ట్రానికి పర్యావరణంగా, జల సంరక్షణ పరంగా ఎంతో ముఖ్యమైందని, ఆక్రమణల వల్ల ఈ సరస్సు వైవిద్యం కోల్పోతుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చేపట్టిన లిడార్ సర్వే ఆధారంగా అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు వేగవంతం చేయాలన్నారు.అటవీ శాఖాధికారులు, డ్రైన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు వారి శాఖల ద్వారా చేపట్టిన ముందస్తు చర్యల గురించి వివరించారు. అక్రమ చేపల చెరువులు, మట్టి పూడికలు తొలగించడానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొల్లేరులో 67 మినీ డ్రైన్ ఛానల్స్ ఉన్నాయని, ముంపు బారిన పడకుండా వటి పూడికతీత పనులు ప్రతిపాదనలు తయారు చేసి అటవీ శాఖ ద్వారా ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని ఆమె సూచించారు. సదరు ప్రతి పాదనలు తయారు చేసిన పిదప రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సహకారంతో ప్రభుత్వ అనుమతి పొందేలా కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.కొల్లేరు పరిసరాల్లో అక్రమ నిర్మాణాలపై నిరంతర నిఘా, తక్షణ నివేదికల సమర్పణ, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆమె సూచించారు.

పోలీసుల అదుపులో ఎనిమిది మంది

దాడి కేసుపై పోలీసుల విచారణ

ఏలూరు క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి) : కిడ్నాప్ కేసులో సహాయకారులుగా ఉన్న వారి మధ్య విభేదాలు రావడంతో ఒకరిపై కొరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటనపై ఏలూరు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దాడిలో పాల్గొన్న 8 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన బాలిబోయిన నవ హర్ష గతంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో రైల్వే ఉద్యోగిని కిడ్నాప్ చేశాడు. అతనికి సహకరించిన యువకులను హర్షను పోలీసులు అరెస్టు చేశారు.ప్రస్తుతం ఈకేసు ఏలూరు కోర్టులో విచారణ సాగుతోంది. కోర్టు వాయిదాలకు వెళ్ళడానికి ఖర్చులను నవహర్ష ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 13వ తేదీ రాత్రి ఏలూరు కోటదిబ్బ డౌన్‌లో నవహర్షను ప్రశ్నించారు. ఆసమయంలో నవహర్షతో పాటు అతని బంధువు ప్రభావతి అనే మహిళ కూడా ఉంది. జరిగిన గొడవలో మహిళపై కూడా ఆ యువకులు దాడి చేశారు. ఈ నేపథ్యంలో నవహర్ష ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మంది నిందితులను గుర్తించి వారి వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీఎన్‌ఎస్ చట్టం 35(3) ప్రకారం నోటీసు ఇచ్చారు. అంతేకాకుండా వారిని బైండోవర్ చేశారు. వారిపై నిఘా ఉంచి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఊరికెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు..

ఏలూరు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి దైవదర్శనానికి వెళ్ళివచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారపు వస్తువులు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన పళ్ళెం హేమంత్ ఈనెల 3వ తేదీన తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో తమిళనాడులోని వేళంగినిలోని మేరీమాత గుడికి వెళ్ళారు. తిరిగి గురువారం వచ్చారు. వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని ఆరు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు హేమంత్ ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పేదలకు చేరకుండా కొంతమంది అక్రమార్గంలో వాటిని కాజేస్తున్నారు. ప్రజలకు న్యాయబద్ధంగా విక్రయించాల్సిన వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. విత్తనాలను, ఎరువులను కల్తీలు చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారు. హోటళ్లలో కల్తీ ఆహార పదార్థాలు విక్రయించడం, నిల్వ పదార్ధాలను వండుతూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారు. ఇలాంటి వాటిని అదుపుచేయడానికి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి విజిలెన్స్ శాఖ దాడులు ముమ్మరం చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందేందుకు జిల్లా విజిలెన్సుశాఖ గట్టి నిఘా పెట్టింది. ఈ నాలుగు నెలల్లో విజిలెన్స్ విస్తృతంగా దాడులు చేసి అక్రమార్కులకు అడ్డుకట్ట వేసింది.

అక్రమార్కులపై

విజిలెన్స్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆకస్మిక తనిఖీలు

కేసులు నమోదు.. జరిమానాలు

ఈ నాలుగు నెలల్లో విస్తృత దాడులు



నర్సాపురం జైన్ జ్యూవెలరీ షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్సు అధికారులు (ఫైల్ ఫోటో)

ఏలూరు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పేద ప్రజలకు అందాల్సిన పీడీఎస్ రైస్ (ప్రజాపంపిణీ విధానం బియ్యం) డీలర్లు, కొంత మంది స్మగ్లర్లు అక్రమమార్గంలో లారీల్లో పోర్టులకు తరలించి విదేశాలకు విక్రయాలు చేస్తుండేవారు. విజిలెన్స్ శాఖ గట్టినిఘా ఏర్పాటు చేసి ఇలాంటి స్మగ్లర్లకు చెక్ పెట్టారు. జనవరి నెల నుంచి ఇప్పటి వరకు చేసిన దాడుల్లో 1178.17 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.43.96 లక్షలు. అంతేకాకుండా కందిపప్పు 11.40 క్వింటాళ్ళు (రూ.76 వేలు), పంచదార 21.47 క్వింటాళ్ళు (రూ.72 వేలు) స్వాధీనం చేసుకుని ఆహారభద్రత చట్టం (6ఎ) చట్టం క్రింద 54 కేసులు నమోదు చేశారు. మరో 11 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఆరు వాహనాలను (రూ.49.20 లక్షలు విలువ) సీజ్ చేశారు. వివిధ హోటళ్ళపై దాడులు చేసి గృహ అవసరాలకు విని యోగించాల్సిన 82 సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు.

- ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై దాడులు చేసి ఏడు కేసులు నమోదు చేశారు.48.86 లక్షల మెట్రిక్ టన్నుల (రూ.7.95 లక్షలు) ఎరువులను, 155.5 లీటర్ల (రూ.6.86 లక్షలు) పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. 245.97 (రూ.282 లక్షలు), మెట్రిక్ టన్నుల చేపల మేతను సీజ్ చేశారు.
- రహదారులపై వివిధ శాఖల అధికారులతో కలిసి విజిలెన్సు శాఖ అధికారులు వాహనాల తనిఖీలు చేసి ఈ ఏడాది జనవరిలో 43 లక్షల 85 వేల 284 రూపాయలు జరిమానాగా వసూలు చేశారు. ఫిబ్రవరిలో 74 లక్షల 25 వేల రెండు రూపాయలు వసూలు చేయగా మార్చిలో కోటీ పదమూడు లక్షల 67 వేల 258 రూపాయలు వసూలు చేశారు. ఏప్రిల్ నెలలో ఒక కోటి 19 లక్షల 36 వేల 183 రూపాయలు వసూలు చేశారు. ఈ నాలుగు నెలల్లో వాహనాల తనిఖీలు చేసి మొత్తం మూడు కోట్ల 51 లక్షల 13 వేల 727 రూపాయలను జరిమానాల రూపంలో వసూలు చేశారు.
- ఈ నాలుగు నెలల్లో విద్యుత్ సామాగ్రి షాపులు, స్వీట్స్ అండ్ బేకరీలు, వాటర్ ప్లాంట్లు, జనరల్ స్టోర్స్, డ్రై ఫ్రూట్స్‌షాపులు, ఆయిల్ షాపులపై తనిఖీలు చేసి తూనికలు, కొలతల చట్ట ప్రకారం 115 కేసులు నమోదు చేశారు. గోల్డ్‌షాపులు, ట్రాన్స్‌పోర్టు ఆఫీసులలో తనిఖీలు చేసి జీఎస్టీ చట్ట ప్రకారం ఏడు కేసులు నమోదు చేశారు. హోటళ్ళు, డ్రైఫ్రూట్ షాపులు, కూల్‌డ్రింక్, ఐస్‌క్రీమ్ షాపులు తనిఖీలు చేసి వాటి నుంచి 17 రకాల శాంపిల్స్‌ను ల్యాబ్ పరీక్షల నిమిత్తం పంపించారు. కేసులు కూడా నమోదు చేశారు. ఈ నెల 3న తణుకు పట్టణంలో స్టీలు, ఇత్తడి సామాగ్రి అమ్మే ఐదు దుకాణాలపై దాడులు చేసి కేసులు నమోదు చేశారు..



ఏలూరులో నకిలీ సిగరెట్లు, గుట్కాలను స్వాధీనం చేసుకున్న అధికారులు (ఫైల్)

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం



శ్రీరాంబాబు, విజిలెన్సు ఎస్పీ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా

ప్రజల ఆరోగ్య భద్రతే విజిలెన్సు లక్ష్యం. ప్రజల ఆరోగ్యంతో ఎవరైనా చెలగాటం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి నెలా హోటళ్ళపై దాడులు నిర్వహిస్తున్నాం. కిరాణా సరుకులు, కూల్‌డ్రింక్, ఐస్‌క్రీమ్ షాపులను తనిఖీలు చేస్తున్నాం. పీడీఎస్ రైస్ అక్రమమార్గంలో తరలించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. వారిపై 6ఎ కేసులు కూడా నమోదు చేస్తున్నాం. మందులు దుకాణాలు, ఆయుర్వేద షాపులపైన తనిఖీలు చేసి ఎక్స్‌పైరీ డేటు కల్గిన ఔషధాలను గుర్తించి కేసులు నమోదు చేశాం. రైతులకు సీజనల్‌గా అవసరమైన విత్తనాలు నాణ్యమైనవి అందేలా చర్యలు చేపట్టి దాడులు నిర్వహించాం. వాహనాల టాక్స్‌లు చెల్లించకుండా అక్రమ, నకిలీ బిల్లులతో సరుకులు రవాణా చేస్తుండడంతో వారానికి ఒకసారి ఆకస్మికంగా వివిధ శాఖల అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టి వారికి జరిమానాలు విధిస్తున్నాం. ఫ్యాన్సీ షాపుల్లో ఎమ్మార్పీ ధరలపై స్టిక్కర్లు అంటించి అధిక ధరలకు విక్రయించే వారిపై భారీ జరిమానాలు విధించి కేసులు నమోదు చేశాం. జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వస్తువులను విక్రయించకుండా అధిక ధర లకు విక్రయించినా, కల్తీ చేసినా, గడువు తీరిన వస్తువులను, ఆహార పదార్థాలను, నిల్వ ఉంచిన నాన్‌వెజ్‌లను వంటకాల్లో విని యోగించినా, వంటకాల్లో రంగులు, రసాయనాలు వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పథకాలు పక్కదోవ పడితే అలాంటి సమాచారం విజిలెన్సు అధికారులకు తెలియజేయవచ్చు. 80082 03317 (విజిలెన్స్ ఎస్పీ) నంబర్‌కు కాల్ చేయవచ్చు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న అంజిబాబు

భీమవరం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి) : యువత సమాజ ప్రగతికి పాటుపడాలని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)అన్నారు. భీమవరం టౌన్‌హాల్ ఆధ్వర్యంలో టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన భీమవరం మండలం, పట్టణంలోని 21 మున్సిపల్, ప్రభుత్వ జడ్పీ పాఠశాలల్లోని 120 మంది విద్యార్థులకు గురువారం మెరిట్ స్కాలర్ షిప్‌లను అంజిబాబు చేతుల మీదుగా అందించారు. అనంతరం భీమవరం టౌన్ హాల్లో యోగా సెంటర్‌ను అంజిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఫిరోజ్‌బాబు, జి.శ్రీనివాస్, చినమిల్లి రాయుడు, బిహెచ్. పేర్రాజు, కె. రామ్మూర్తి, చనమల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోకో గింజలకు మద్దతు ధర చెల్లించాలి



ఆందోళన చేస్తున్న కోకో రైతులు, సంఘ నాయకులు

ఏపీ రైతు సంఘం మహాధర్నా

ఏలూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి) : కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలంటూ రైతులు కదం తొక్కారు. గురువారం ఏలూరు సమీపంలోని చోదిమెళ్ళ సమీపంలోని సోమవరప్పాడు జాతీయ రహదారి వద్ద మోండలీజ్ కంపెనీ ఆఫీసు గోడౌన్ వద్ద ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. కోకో గింజల ధరలు తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోకో రైతుల మహా ధర్నాకు రిటైర్డ్ డీజీపీ ఎ.బి. వెంకటేశ్వరరావు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోకో గింజనల కొనుగోళ్ల కంపెనీల ఇష్టారాజ్యంగా మారిపోయిందన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కంపెనీలు రైతులను మోసగిస్తే సహించేది లేదన్నారు. కంపెనీ దిగిరాకపోతే కార్యకలాపాలు స్తంభింపచేయడానికి వెనకాడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, కోనేరు సతీష్‌బాబు, పి.నరసింహరావు, కట్టా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పాక వేస్తున్న గ్రామస్థులు

పుట్టింటికి వచ్చిన ముత్యాలమ్మ

మొగల్తూరు, మే 15(ఆంధ్రజ్యోతి) : మొగల్తూరు గ్రామ దేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారిని గురువారం అత్తింటి నుంచి పుట్టినిల్లు మొగల్తూరుకు తీసుకొచ్చి నిలబెట్టారు. ప్రతీ ఏటా సంక్రాంతి సమయంలో అమ్మవారి జాతర నిర్వహించి అమ్మవారిని గరువుపల్లవపాలెం ఉప్పుటేరు అవతల ప్రాంతానికి సాగనంపుతారు. తిరిగి ముత్యాలమ్మ అమ్మవారి ఘటాలను వైశాఖ మాసంలో మంచి ముహుర్తానికి ఆలయ ధర్మకర్త గురుజు చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో తీసుకొచ్చి అమ్మ వారికి నడివీధిలో పాకనిర్మించి నిలబెట్టడం ఆనవాయితీ. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

సేంద్రియ సాగును ప్రోత్సహిస్తాం

ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఉంగుటూరు, మే 15(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో సేంద్రియ సాగును ప్రోత్సహిస్తామని, రైతులు సాగుపైనే ఆధారపడకుండా అనుబంధ రంగాలైన పశుపోషణ, జీవాలు, చేపలు, కోళ్ల పెంపకాలను చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. గురువారం ఉంగుటూరు మండలం నాచుగుంట, వెల్లమిల్లి గ్రామాల్లోని సమగ్ర వ్యవసాయంలోని వివిధ రకాల సాగును పరిశీలించారు. నాచుగుంటలోని గద్దే రత్నాజీ సేంద్రియ చేపల సాగుతో పాటు వెల్లమిల్లిలోని పరిమి రాజేంద్ర ప్రసాద్ చేలోని వివిధ రకాల సేంద్రీయ పంటలను పరిశీలించి రైతులతో మమేకమయ్యారు. రైతు భాస్కరరావు జీలుగు విత్తనాలు అందడం లేదని కలెక్టర్‌కు తెలపడంతో 50 శాతం రాయితీతో ఉన్న విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సేంద్రియ రైతు గద్దే రత్నాజీ రైస్ మిల్లు కోసం అభ్యర్థించగా తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.పది లక్షల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కలెక్టర్ వెంట సేంద్రియ వ్యవసాయ శాఖ జిల్లా పీడీ ఎం.బాలిన వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో మోసం

విదేశాలకు కూలీలను పంపుతున్న ముఠా అరెస్టు

శంషాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో పని చేస్తే ఎక్కువ డబ్బు వస్తుందని కూలీలను నమ్మించి ఎనిమిది మందిని నకిలీ వీసాలతో విదేశాలకు పంపుతున్న ఇద్దరిని ఆర్జీఐఏ పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి ఏడు మొబైళ్లు, 14 నకిలీ వీసా పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఎయిర్ పోర్టులో తీవ్ర సంచలనం రేపిన ఈ ఘటనకు సంబంధించి వివరాలను శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో తెలిపారు. ఈ మేరకు ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన సత్యనారాయణ, గోపాల్, బాలాజీ, అంజి, శివకుమార్‌తో పాటు మరో ఇద్దరు మొత్తం ఏడుగురు కలిసి ముఠాగా ఏర్పడ్డారని అన్నారు. ఈ ముఠా గ్రామీణ ప్రాంతాల్లో చదువురాని వారిని లక్ష్యంగా చేసుకుని విదేశాల్లో పని ఆశ చూపించి ఎక్కువ డబ్బులు దండుకుంటూ నకిలీ వీసాలతో విదేశాలకు పంపుతారు.ముందుగా వర్క్ వీసాలుగా చూపించి ఆ తర్వాత వాటిని రద్దు చేసి విజిటింగ్ వీసాలుగా తయారు చేసి దుబాయ్, మస్కట్ తదితర దేశాలకు పంపిస్తారు. ఈ ముఠా సభ్యులు 8 మంది గురువారం దుబాయ్ వెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించి ఆ ముఠాలో సభ్యుల్లో అంజి, గోపాల్‌లను అరెస్టు చేశారు. మిగతా నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి ముఠాను నమ్మి మోసపోవద్దని ఆర్జీఐఏ పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టులో ఏసీ మెకానిక్‌కి పాము కాటు

పోలవరం, మే 15(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టులో ఏసీ మెకానిక్ పాముకాటుకి గురై తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఏసీ మరమ్మతులకు గురి కావడంతో పోలవరం పంచాయతీ బీసీ కాలనీకి చెందిన తెలగంశెట్టి భార్గవ్ అనే మెకానిక్ రిపేరు చేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఏసీ మెషీన్‌లో ఉన్న తాచుపాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన ప్రాజెక్టు సిబ్బంది అతనిని పోలవరం ప్రభుత్వా సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి కృష్ణంరాజు అతనికి పాము కాటు విరుగుడు ఇంజక్షన్ ఇచ్చి వైద్య సేవలందించారు.బాధితుడిని కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



తాడేపల్లిగూడెం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెంలోని ఓ స్వీట్‌స్టాల్ ఖార్ఖానాలో గురువారం చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెంలోని దుర్గా స్వీట్ హోంలో స్వీట్లు తయారుచేసే ప్రాంతంలో గ్రైండర్ స్విచ్ ఆన్‌చేసే సమయంలో అక్కడ పని చేస్తున్న ఎస్.సూరిబాబు(38) షాక్ తగలడంతో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెం దినట్టు వైద్యులు గుర్తించారు. అందిన ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో విచా రణ చేపట్టినట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

భార్య, కుమారుడు అదృశ్యంపై ఫిర్యాదు

అత్తిలి, మే 15(ఆంధ్రజ్యోతి) : భార్య, కుమారుడు అదృశ్యమయ్యారని అత్తిలి శివారు గోగులమ్మ పేటకు చెందిన చందు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భార్య పెన్నాడ లావణ్య, కుమారుడు సాయి ఈ నెల 14 నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు అత్తిలి ఎస్ఐ పి.ఇ.ప్రేమరాజు తెలిపారు. ఈ నెల 14న తెల్లవారుజామున లేచి ఇద్దరూ కనిపించలేదని భర్త ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మొగల్తూరు, మే 15(ఆంధ్రజ్యోతి) : ముత్యాలపల్లి పంచాయతీ పరిధి కట్టావారిమెరకకు చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. కట్టావారిమెరకకు చెందిన బెల్లపు మహాలక్ష్మీ(22) సంవత్సరాల యువతి ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద యువతి కోసం ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో యువతి తండ్రి బెల్లపు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని భర్త మృతి.. భార్యకు గాయాలు



ఏలూరు క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న దంపతు లను ఎదురుగా రాంగ్ రూటులో వచ్చిన కారు ఢీ కొనడంతో భర్త మృతి చెందగా భార్య తీవ్ర గాయాలకు గురైంది. లింగపాలెం మండలం ధర్మాజీ గూడెం గ్రామానికి చెందిన షేక్ పీర్ అహ్మద్(36)కు భార్య అస్మా, ఇద్దరు పిల్లలున్నారు. ధర్మాజీగూడెంలో పంక్చర్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యా, భర్తలిద్దరూ గురువారం ఏలూరు మోటారు సైకిల్‌పై వచ్చి మధ్యాహ్నం తిరిగి వెళ్తుండగా ధర్మాజీగూడెంలోని థియేటర్ ఎదురుగా ఓ కారు అతి వేగంగా రాంగ్ రూటులో వచ్చి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన అహ్మద్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అస్మా నడుం విరిగిపోయింది. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



ముసునూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ముసునూరు గ్రామ శివారు శ్మశానవాటిక వద్ద ఉన్న మలుపులో గురువారం రాత్రి పొగాకు దుత్తల లోడ్ ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు రక్తపు గాయాల య్యాయి. గోపవరం నుంచి దుత్తలు లోడ్ చేసుకుని చెక్కపల్లి వైపు వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. వెంటనే డ్రైవర్ ఇంజిన్‌పై నుంచి దూకడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన డ్రైవర్‌ను ముసునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

కామవరపుకోట, మే 15(ఆంధ్రజ్యోతి):తక్కువ ఖర్చుతో వ్యవసాయం సాగించేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రావికంపాడు సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, మండల వ్యవసాయశాఖాధికారి సి.పవన్‌కుమార్ తెలిపారు. గురువారం రావికంపాడులోని రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 500 నవధాన్యాల కిట్‌లను రైతులకు అందజేశారు. వీహెచ్‌ఏ వెన్నెల, అనంత పద్మనాభం, ప్రమీల, రవి, సతీష్, మురళీ, దుర్గాదేవి, నవీన్ పాల్గొన్నారు.

పోలవరంలో ఉచిత వైద్యం

పోలవరం, మే 15(ఆంధ్రజ్యోతి):పోలీసుల ఆధ్వర్యంలో పోలవరం ఉచిత మెగా వైద్య శిబి రం నిర్వహించారు. రాజమహేంద్రవరం మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యుల ఆధ్వర్యం లో పోలవరం సీఐ బాల సురేశ్ బాబు నేతృ త్వంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన వారు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పరిధిలో పరిసర గ్రామాల నుంచి 200 మంది ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నట్టు ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపారు.

రేషన్ సక్రమంగా సరఫరా చేయాలి

జీలుగుమిల్లి, మే 15(ఆంధ్రజ్యోతి):రేషన్ సరుకులు గిరిజన గ్రామాల్లో సక్రమంగా సరఫరా చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంకన్నగూడెం పంచాయతీ పరిధిలో రెడ్డిగూడెం, రామచంద్రపురం, దిబ్బగూడెం మారుమూల గిరిజన గ్రామాల్లో 662 రేషన్ కార్డులుండగా 60 కుటుంబాలకు ఇప్పటికీ రేషన్ అందలేదన్నారు. సిగ్నల్ లోపం కారణంగా లబ్ధిదారులంతా జీసీసీ రేషన్ దుకాణం వద్దకు వెళ్లి రేషన్ తీసుకుంటున్నారు. ఒకటి నుంచి 17వ తేదీ వరకు రేషన్ సరఫరా చేయాల్సి ఉండగా 8వ తేదీతో పంపిణీ నిలిపివేశారని అన్నారు. అనంతరం వెళ్లిన వారికి రేషన్ ఇవ్వకుండా స్టాక్ వెనక్కి పంపినట్టు సంబంధిత రేషన్ సిబ్బంది చెప్పడం గమనార్హం.

ఈ విషయమై సంబంధిత అధికారులు దృష్టి సారించి పేద గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం అందించే రేషన్ సక్రమంగా అందేలా చూడాలని గ్రామానికి చెందిన సోయం ప్రకాష్ కోరారు.

మినీ మహానాడుకు లింగపాలెంలో స్థలం పరిశీలన

లింగపాలెం, మే 15(ఆంధ్రజ్యోతి):లింగపాలెంలో ఈ నెల 18న జరగనున్న మినీమహానాడును విజయవంతం చెయ్యాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలో లింగపాలెంలో స్థానిక నాయకులతో కలిసి మినీ మహానాడు నిర్వహించే స్థలం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మినీ మహానాడుకు చింతలపూడి నియోజకవర్గం నుంచి గ్రామ, మండలస్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా టీడీపీ కేడర్ కృషి చెయ్యాలన్నారు. గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, జగ్గవరపు ముత్తారెడ్డి, గారపాటి బుజ్జయ్య పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

జంగారెడ్డిగూడెం, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం బుట్టాయగూడెం రోడ్డులోని శ్రీ సీతారామ కాలక్షేప కల్యాణ మండపంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని టీడీపీ పట్టణాధ్యక్ష, కార్యదర్శులు రావూరి కృష్ణ, తూటిగుంట రాము, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావులు తెలిపారు. పట్టణంలోని ఒకటి నుంచి ఐదు వార్డు వరకు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అలాగే తాడువాయిలో శుక్రవారం రాత్రి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని అన్నారు.

జూలై 5, 6, 7 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

చింతలపూడి, మే 15(ఆంధ్రజ్యోతి):చింతలపూడిలో జూలై 5, 6, 7 తేదీల్లో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం ఎం.వసంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదు వేల మందితో ప్రదర్శన నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకరరావు, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రామారావు, బండి వెంకటేశ్వరరావు, ఎం.డి.మునీర్, ఉప్పులూరి హేమశంకర్, కంచర్ల గురవయ్య, టి.వి.ఎస్.రాజు, కన్నబాబు, సోమశేఖర్, బుచ్చిబాబు, తొర్లపాటి బాబు పాల్గొన్నారు.

వేంకటేశ్వర కళాశాలను సందర్శించిన ఆర్‌ఐవో

ఏలూరు/కామవరపు కోట, మే 15(ఆంధ్రజ్యోతి):కామవరపుకోట శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలను ఆర్‌ఐవో యోహాన్ గురువారం సందర్శించారు. కాలేజీలో 2025-26లో విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రక్రియ కొనసాగుతుందా? లేదా అన్నది పరిశీలించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడకు తాను వచ్చినట్టు ఆయన తెలిపారు. కాలేజీలో అడ్మిషన్లు తీసుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీని కాలేజీని బుధవారం సందర్శించి, ఈ అంశంపై విద్యా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తాననడంతో కదలిక వచ్చింది. ఈ క్రమంలో కాలేజీలో కొందరు విద్యార్థులు తాము అడ్మిషన్లకు వచ్చామని యోహాన్‌కు తెలపగా, ఆయన ఆ విద్యార్థుల వివరాలను సేకరించారు. కళాశాలలో అన్ని సౌకర్యాలున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు ఇస్తానని తెలిపారు. దీంతో కళాశాలలో అడ్మిషన్లపై త్వరలో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఏలూరు రూరల్/టి.నర్సాపురం/ఏలూరు కార్పొరేషన్, మే 15(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు, హేలాపురి ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ కార్మికబోర్డును పునరుద్ధరించాలని 40 లక్షలు మంది ఉన్న కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు ఫైచర్ల శంకర్రావు, సెక్రటరీ బత్తిన శ్రీనివాసరావు, ఆర్గనైజర్ సెక్రటరీ ఉమా సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టి.నర్సాపురంలో సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ఆశ వర్కర్లు ఎస్.విజయ, లక్ష్మి, వనిత పాల్గొన్నారు. నగరంలోని పలు డివిజన్లలో ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాసడాంగే, పళ్ళెం కిశోర్, జగన్నాథరావు, బండి వెంకటేశ్వరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు.

గర్భిణి కుటుంబానికి బొరగం పరామర్శ



పోలవరం, మే15(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన గర్భిణి శిరీష కుటుంబాన్ని పోలవరం టీడీపీ ఇంచార్జి, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ శిరీష కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యశాఖ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం మృతురాలి కుటుంబానికి వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు.

గర్భిణి మృతికి డాక్టర్లే కారణం : పీవోడబ్ల్యూ

బుట్టాయగూడెం : గర్భిణి శిరీష మృతికి పోలవరం పీహెచ్‌సీ వైద్యులే కారణమని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ నిండు గర్భిణి మృతికి కారణమైన డాక్టర్లను వెంటనే విధుల నుంచి తొలగించాలని, శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు విజ్ఞప్తి చేశారు.

50 కోట్లతో రోడ్ల అభివృద్ధి : ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం, మే 15(ఆంధ్రజ్యోతి):పోలవరం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రూ.50 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.27 కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.30 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గురువారం మండలంలోని వేపులపాడు-అంకన్నగూడెం గ్రామాల మధ్య నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డమణుగు రవికుమార్, మెట్ట బుచ్చిరాజు, చోడెం వీరాస్వామి, జీఎస్ఎన్ నాయుడు, నరిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏజెన్సీకి స్పెషల్ డీఎస్సీ ఇవ్వాలి : ఆదివాసీ జేఏసీ



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం, మే 15(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతానికి స్పెషల్ డీఎస్సీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ఏపీ ఆదివాసీ జేఏసీ పిలుపు మేరకు గిరిజన నాయకులు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. వివిధ గిరిజన ఆదివాసీ సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ టీఏసీ ఏర్పాటుతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మొదటి రోజు దీక్షల్లో సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరావు, ఉయికె బుజ్జిబాబు, నాయకులు పట్టం రమేశ్, మూలెం రాంబాబు, పొట్టా వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

మా పిల్లలను మరో స్కూల్‌కు పంపలేం

- కండ్రికగూడెం ఎంపీయూపీ స్కూల్‌ను వేరు చేయడంపై తల్లిదండ్రుల అభ్యంతరాలు
- అప్రమత్తమైన జిల్లా విద్యాశాఖ - ఉన్నతాధికారులకు డీఈవో నివేదిక

ఏలూరు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తయి, స్కూళ్లవారీగా ఉపాధ్యాయ వేకెన్సీల నిర్ధారణ ముగింపు దశకు చేరుకుంటున్నదశలో నగరంలోని ఒక స్కూల్‌కు సంబంధించి జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం పాఠశాల విద్య కమిషనర్, డీఈవోల దృష్టికి తీసుకొచ్చారు. తప్పిదం జరిగిన విషయాన్ని గమనించిన జిల్లా విద్యాశాఖ వెంటనే అప్రమత్తమై దిద్దుబాటు చర్యలను చేపట్టినప్పటికీ, తుది నిర్ణయం ఉన్నతాధికారుల చేతుల్లోనే ఉన్నట్టు చెబుతున్నారు. ఏలూరు రూరల్ మండలం కండ్రికగూడెం ఎంపీయూపీ స్కూల్ నుంచి పునర్వ్యవస్థీకరణలో భాగంగా 98మంది బాలబాలికలున్న ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించే ప్రాథమిక పాఠశాలను వేరుచేసి, ఒకటిన్నర కిలోమీటరు దూరానికిపైగా ఉన్న మరో పాఠశాలకు షిఫ్టు చేయడం గురువారం సంబంధిత పిల్లల తల్లిదండ్రుల ఆగ్రహానికి కారణమైంది. వాస్తవానికి విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఇక్కడి పాఠశాలలో పూర్తిస్థాయిలో విద్యార్థుల సంఖ్య ఉన్నప్పటికీ బలవంతంగా మరో చోటకు తరలించడం వల్ల ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయే ప్రమాదం నెలకొంది. ఇక్కడి స్కూల్‌ను ఉన్నత పాఠశాలగా వర్గోన్నతి చేసేక్రమంలో ప్రాథమిక పాఠశాలను ఎత్తివేయడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. హైస్కూల్ ఆవరణలోనే ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని, కొత్తగా ఏర్పాటు చేయనున్న హైస్కూలు తరగతులకు ఇంతవరకు ఒక్క విద్యార్థీ లేకపోయినా, 98మంది చిన్నపిల్లలున్న ప్రాథమిక పాఠశాలను మరోచోటకు తరలించడం అభ్యంతర కరమని ఆరోపించారు. పేరెంట్స్ ఆందోళనను లేఖ రూపంలో విద్యాశాఖ కమిషనర్‌కు పంపామని ఏపీఎస్టీయే రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు స్టీవెన్ తెలిపారు. దీనిపై డీఈవో వెంకట లక్ష్మమ్మను వివరణ కోరగా సంబంధిత స్కూల్లో తలెత్తిన సమస్యను ఉన్నతాధికారులకు నివేదించానని, తుది నిర్ణయం వారే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆదేశాలు వచ్చిన తరువాత తరుపరి చర్యలు ఉంటాయన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- వంతెన శంకుస్థాపనలో మంత్రి సారథి



బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సారథి

ఏలూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యత నిస్తుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఏలూరు జ్యూట్ మిల్ జంక్షన్ సమీపంలో కృష్ణా - ఏలూరు కాలువపై రూ.5 కోట్లతో నిర్మించనున్న నాలుగు వరుసల వంతెన నిర్మాణానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబులతో కలిసి రాష్ట్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ వంతెన పూర్తయితే భవిష్యత్‌లో ఏలూరు నగర అభివృద్ధికి, ట్రాఫిక్ నియంత్రణకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గా భవాని, ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఏలూరు ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఇ భరతరత్నం, ఈఈవైవీ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబాన్ని ఆదుకుంటాం

పెదవేగి :ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ నాయకుడు మట్టా నాగరాజు కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. పెదవేగి మండలంభోగాపురం గ్రామానికి చెందిన మట్టా నాగరాజు(36) మంగళవారం ఉదయం వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి మాట్లాడుతూ నాగరాజు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, మే 15(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ వ్యాప్తంగా 144 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణనిచ్చి మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, శ్రీటెక్నాలజీ సంస్థ రిజనల్ మేనేజర్ ప్రదీప్, నిర్వాకులు రమేష్‌లు ప్రారంభించారు. గురువారం దెందులూరు బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ టీడీపీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని అన్నారు. బీసీలకు సంబంధించిన ఆదరణ పనిముట్లను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అమ్ముకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), మోతుకూరి నాని, గారపాటి కొండయ్య చౌదరి, తోట యేసమ్మ, ఇప్పిలి వెంకటేశ్వరరావు, సంపంగి వేణుగోపాల తిలక్, పెనుబోయిన మహేష్ యాదవ్,వీరమాచినేని ప్రభాకర్, యలమర్తి శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దార్ సుమతి, మాగంటి నాని పాల్గొన్నారు.

అపర భగీరథుడు కాటన్ సేవలు చిరస్మరణీయం



ఏలూరులో కాటన్ విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న అధికారులు

ఏలూరు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి):అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని గురువారం నగరంలో పలుచోట్ల నిర్వహించారు. ఏలూరు సర్కిల్ ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలోని కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఏపీఎన్జీవోల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చైర్మన్ సి.హెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన కాటన్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. సంతోషి నగర్‌లో ఏపీ పీఏవో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజే ఏసీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.శ్రీనివాసరావు, టి.జయరాజు, భోగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఎన్‌జీవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీర్స్ ఫెడరేషన్ కన్వీనర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎన్జీవో సంఘ కార్యదర్శి ఎన్ రామారావు, నోరి శ్రీనివాస్, ఇంజనీర్లు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఆవరణలో కాటన్ జయంతిని నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

● దెందులూరు : స్థానిక లైబ్రరీ సెంటర్‌లో బత్తిన వెంకటేశ్వరరావు(వెంకన్న) ఏర్పాటు చేసిన కాటన్ విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యా సంస్థల అధినేత, రామదండు సభ్యులు మొటపర్తి రాజా, విజయ నగేశ్, కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, సీపీఎం నాయకులు బలగం అప్పారావులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంపంగి వేణుగోపాల తిలక్, వెంకటాద్రి మస్తారు, సుగ్గిశెట్టి పిచ్చేశ్వరరావు, నందమూరి వెంకటరత్నం, కొలుసు గణపతి, దేవినేని తులసిదాసు, తోట రమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాల్లో శిక్షణ



లింగపాలెంలో యోగా చేస్తున్న విద్యార్థులు

ఏలూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి) : మహిళా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఎం.జగదీశ్వరి విద్యార్థుల చేత కథలు చదివించి వినిపించారు. అనంతరం బి.హిమాలేశ్వరి స్పోకెన్ హిందీ, జి.సుబ్బలక్ష్మి, క్విజ్‌లో శిక్షణనిచ్చారు. కార్యక్రమాలను రిసోర్స్ పర్సన్స్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఈ పద్మావతి, జి.సంధ్యారాణి, గ్రంథాలయాధికారి యాగంటి శ్రీదేవి పర్యవేక్షించారు.

● పెదవేగి : విద్యార్థులకు ఆటపాటలతో విద్యను అందించాలని పెదవేగి శాఖాగ్రంథాలయం గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖాగ్రంథాలయంలో గురువారం ఆటల పాటలపై శిక్షణ ఇచ్చారు.

● లింగపాలెం : యోగా మానసిక, శారీరక ఒత్తిడి తగ్గించి ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని గ్రంథాలయాధికారి సి.హెచ్.వెంకట రమణ అన్నారు. మండలంలో లింగపాలెం, ధర్మాజీగూడెం గ్రంథాలయాల్లో విద్యార్థులకు గణితంపై శిక్షణనిచ్చారు. యోగాతో మానసిక, శారీరక ఒత్తిడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో లతీఫ్, ఎ.వి.నారాయణ పాల్గొన్నారు.

● పెదపాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో కాటన్ గురించి పిల్లలకు అవగాహన కల్పించినట్టు గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు తెలిపారు. అనంతరం కథలు వివరించి, పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



టీడీపీ ఏలూరు రూరల్ మండలాధ్యక్షుడిగా నాగరాజు

పెదవేగి, మే 15(ఆంధ్రజ్యోతి):టీడీపీ ఏలూరు రూరల్ మండలాధ్యక్షుడిగా నంబూరి నాగరాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పైడిపాటి శేఖర్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతికార్యకర్తను సమన్వయం చేసుకుంటూ నాయకులు ముందుకెళ్లాలన్నారు.



సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

కుక్కునూరు, మే 15(ఆంధ్రజ్యోతి): బర్లమడుగు గ్రామంలో నాలుగు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో గిరిజనులకు సంబంధించిన రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ క్రమంలో గురువారం జనసేన నాయకులు ఆ బాధిత కుటుంబాల్ని పరామర్శించి రూ.10 వేల నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, వెంకన్నబాబు, ములిశెట్టి నరేశ్, నాగరాజు, కృష్ణా, ధనస్వామి పాల్గొన్నారు.



జవహర్‌కు హారతి పడుతున్న మహిళలు

మాజీ మంత్రి జవహర్‌కు ఘన స్వాగతం

కొయ్యలగూడెం, మే 15(ఆంధ్రజ్యోతి):ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు కొయ్యలగూడెంలో ఘనస్వాగతం లభించింది. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం గణపతి సెంటర్ వద్ద కూటమి నాయకులంతా ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, జ్యేష్ఠ రామకృష్ణ, మేఘలాదేవి, వెంకట్రమణ పాల్గొన్నారు.

జవహర్‌కు శుభాకాంక్షలు...

జంగారెడ్డిగూడెం : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి కె.ఎస్.జవహర్‌ను జంగారెడ్డిగూడెం టీడీపీ నాయకులు గురువారం కొవ్వూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ముస్తఫా, వందనపు హరికృష్ణ, ఎడ్లపల్లి ఏడుకొండలు, పోలిన శ్రీనివాస్ పాల్గొన్నారు.



రాజుపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామదర్శిని

ద్వారకాతిరుమల, మే 15(ఆంధ్రజ్యోతి):ప్రజాసమస్యల పరిష్కార వేదికగా గ్రామదర్శిని నిలుస్తుందని దీనిని వినియోగించుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రజలను కోరారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాభివృద్ధి కుంటుపడిందన్నారు. మారంపల్లి, జాజులకుంట, రాజుపాలెం, గుణ్ణంపల్లి, సత్తాల, పి.కన్నాపురం, నారాయణపురం, పంచాయతీల్లో గురువారం జరిగిన గ్రామదర్శిని కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మలసా నికుంటలో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నేతలు పోలిన శ్రీను, లంకా సత్తిపండు, జడ్పీ టీసీ శామ్యూల్, నాదెండ్ల సురేంద్రనాథ్ చౌదరి, రాజుపాలెం సర్పంచ్ దేవరపల్లి నర్సమాదేవి రాయుడుబాబు, మాచిరెడ్డి గాంధి, దాలయ్య, డి.హేమంత్, ఎంపీడీవో ప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు, మే 15(ఆంధ్రజ్యోతి):రామారావుగూడెం, గుడిగుంట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. రామారావుగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో రామారా వుగూడెం, మలకచర్ల, కె.ఎన్.పురం, గండివారి గూడెం, ముప్పవరం, తిమ్మన్నగూడెం, ముప్ప వరం, మేదినరావుపాలెం, ధర్మారావుపేట గ్రా మాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. గుడిగుంట పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

పెదపాడు సెక్షన్ పరిధిలో..

పెదపాడు : పెదపాడు సెక్షన్ పరధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు తెలిపారు. పెదపాడు, నాయుడు గూడెం, గుడిపాడు, వడ్డిగూడెం, సత్యవోలు, కొణికి, గోగుంట, వసంతవాడ, తోటగూడెం, పునుకొల్లు, వీరమ్మకుంట పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

కూచింపూడి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో..

పెదవేగి : కూచింపూడి విద్యుత్ ఉపకేంద్రంలో ఆర్డీఎస్ఎస్ పథకం పనుల కారణంగా 17, 18 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు.ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, కూచింపూడి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామశింగవరం పరిధిలో..

రామశింగవరం విద్యుత్ ఉపకేంద్రంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కె.ఎం. అంబేడ్కర్ తెలిపారు. ఈ కారణంగా రామశింగవరం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాదేపల్లి సెక్షన్ పరిధిలో..

ఏలూరు రూరల్ : మదేపల్లి సెక్షన్ పరిధిలోని సుంకరివారి తోట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. మాదేపల్లి రోడ్, సుంకరివారి తోట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిర్వహణ కారణంగా మాదేపల్లి రోడ్డు, సుంకరివారితోట, ప్రే మాలయం, గాయత్రినగర్, వెంకటాపురం, ఎంపీ రోడ్, జాలిపూడి, లింగరావు గూడెం, కాట్లంపాడు, శ్రీపర్రు, మాసూరు, యంహెచ్‌పురం, కలకుర్రు, గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 342 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి):ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన గణితం, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ మేరకు ఆర్‌ఐవో యోహాన్ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 5,490మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 5220 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 919మందికి 847మంది హాజరయ్యారని తెలిపారు.



సాంకేతిక సమస్యలతో నిలిచిన ఆర్టీసీ బస్సు

పోలవరం మే 15(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం నుంచి పోలవరం వస్తున్న ఆర్టీసీ బస్సు గురువారం మధ్యాహ్నం సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయింది. దీంతో మార్గమధ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎల్.ఎం.డి.పేట సమీపంలో కొవ్వాడ కాలువ వద్ద పంక్చర్ కారణంగా నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు బస్సు దిగి ఇతర వాహనాల్లో తమ గమ్యానికి చేరుకున్నారు. పాత బస్సుల కారణంగానే ఈ సమస్య వస్తోందని, కొత్త బస్సు సర్వీసులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు/చింతలపూడి, మే 15(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సంబంధించి పెదపాడు మండలంలోని క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలకు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అమీలు జమ తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాలని, అర్హులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



పెదపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి):పెదపాడులో ఈదురు గాలులతో కూడిన జోరున వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పెదపాడు శివారు రామచంద్రపురంలో ఓ ఇంటి ఆవరణలో వున్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. ఈదురు గాలులు, వర్షం ప్రభావంతో విద్యుత్తు అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్తును నిలుపుదల చేశారు.



మృతి చెందిన పాడిగేదెలు

విద్యుదాఘాతానికి గేదెలు మృతి

కొయ్యలగూడెం, మే 15(ఆంధ్రజ్యోతి): యర్రంపేటలో ఐదు పాడి గేదెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. రైతు పసల శ్రీనుకు చెందిన నాలుగు గేదెలు, ఒక దూడ చనిపోయాయి. పొలంలో విద్యుత్‌వైరు తెగిపడటం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని రైతు శ్రీను తెలిపారు. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

వేలేరుపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతోందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి ఎస్.కె.గౌస్ విమర్శించారు. గురువారం ప్రజాపంథా అనుబంధ సంస్థ ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ పోలవరం డివిజన్ మహాసభ మండలంలోని చెరువుగొల్లగూడెం గ్రామంలో జరిగింది. ఈ సభలో పాల్గొన్న ఎస్‌కే.గౌస్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ యువత నిరుద్యోగ సమస్యను పక్కన పెట్టి మతోన్మాదం, కులఉన్మాదాన్ని పెంచి పోషిస్తూ వారి జీవితాలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని, లేదంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, కట్టం వీరాస్వామి, స్వయం చంద్రరావు, ఎస్‌కే మున్నీ, భాస్కర్, ప్రశాంత్ పాల్గొన్నారు.



సచివాలయ భవనంపై జగన్ బొమ్మ

ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలపై వైసీపీ బొమ్మలే కనిపిస్తున్నాయి. బొమ్మినంపాడు గ్రామ సచివాలయ కార్యాలయ భవనంపై వైసీపీ హయాంలో నవరత్నాల పథకం ఎంబ్లమ్‌లో మాజీ సీఎం జగన్ ఫొటో అలాగే ఉంది. వైసీపీ బొమ్మలను తొలగించడంలో అధికార్లు దృష్టి పెట్టకపోవడం విమర్శలకు దారి తీస్తుంది. - ముదినేపల్లి

మొబైల్ యాప్‌లో రేషన్ కార్డుకు దరఖాస్తు

కలిదిండి, మే 15 (ఆంధ్రజ్యోతి): మొబైల్ యాప్‌లో రేషన్ కార్డుకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ గురువారం ప్రకటనలో కోరారు. గ్రామ సచివాలయాల్లో రేషన్ కార్డుల దరఖాస్తులు అధికంగా రావడంతో పలు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. మంత్రి లోకేశ్ రేషన్ కార్డుల దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారని, అర్హులైన వారు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో అనూరాధ, పాల్గొన్న ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులు

అధికారులు సమష్టిగా పనిచేయాలి

» డీపీవో అనూరాధ

ముదినేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచడానికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమష్టి కృషి చేయాలని డీపీవో కె.అనూరాధ తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలోని 4 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవో (పూర్వపు ఈవోఆర్డీ)లు, గ్రామ పంచాయతీల కార్యదర్శుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పంచాయతీ పరిపాలన, సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల నిర్వహణ తదితర అంశాలపై డీపీవో దిశానిర్దేశం చేశారు. పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీ కంపోస్టు తయారీపై దృష్టి పెట్టాలని, గ్రామాల్లో చెత్తను సేకరించాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతను పాటించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీల్లో చేపల చెరువు లీజు బకాయిలు, ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. కొత్త గృహాలకు ఇంటి పన్ను విధించాలన్నారు. పంచాయతీల నిధుల వినియోగం విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని డీపీవో స్పష్టం చేశారు. కొన్ని పంచాయతీలపై స్పందనలో ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి అంశంలోనూ కార్యదర్శులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వ్యక్తి గత మరుగుదొడ్డి ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు తరచు పంచాయతీల వ్యవహారాలను సమీక్షించాలని డీపీవో అనూరాధ తెలిపారు. సమావేశంలో డీఎల్‌పీవో పూర్ణచంద్రశేఖర్, ఎంపీడీవోలు వై.రామకృష్ణ, కొండలరావు, డిప్యూటీ ఎంపీడీవోలు అశోక్, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో అనంతరం ముదినేపల్లి, కోడూరు, గురజ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను డీపీవో పరిశీలించారు.

బొమ్మినంపాడు సర్పంచ్‌పై ఫిర్యాదు

ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు పంచాయతీలో పాలనాపరమైన అంశాలు, నిధుల వినియోగం, సర్పంచ్ తీరుపై డీపీవో అనూరాధకు ఉప సర్పంచ్ పాలంకి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. డీపీవోను కలసి పంచాయతీలో జరిగిన అవకతవకలపై మెమొరాండం అందజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీలో నిధుల వినియోగంపై రికార్డులను సర్పంచ్ చూపించడం లేదని, గతంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని డిపివోకు ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన బీజేపీ నేత కృష్ణారావు



ముదినేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టత, సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాలని, అదే సమయంలో ప్రజలు సమస్యల పరిష్కారంపై కూడ దృష్టి పెట్టాలని పురందేశ్వరి సూచించినట్లు కృష్ణారావు తెలిపారు.

ముగిసిన జగన్నాథుడి బ్రహ్మోత్సవాలు

ముదినేపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): వడాలి గ్రామంలోని సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన జరిగింది. సుమారు 4 వేల మంది స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. అంతకుముందు టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహరావు, ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు కుంభ పూజలు జరిపి అన్న సమారాధనను ప్రారంభించారు. అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు.

కలిదిండిలో భారీ అన్న సమారాధన

కలిదిండి, మే 15 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈవో కె.శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నున్న రమాదేవి, బోయిన గోవింద్, భట్రాజు ఏసుబాబు, సర్పంచ్ మారుతి ప్రసన్న, పూర శ్రీధర్, గుడిపాటి వాసుదేవరావు, నాగేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏవో దివ్య

కైకలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు భూమి యజమాని అంగీకారంతో కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకోవాలని ఏవో ఆర్ దివ్య సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు కౌలు గుర్తింపుకార్డుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో దివ్య మాట్లాడుతూ పంట నష్ట పరిహారం, పంట రుణాలు పొందడానికి గుర్తింపు కార్డు తప్పనిసరి అన్నారు. కార్డు కేవలం 11నెలల పరిమితి కాలం వరకే వర్తిస్తుందన్నారు. ప్రతీ కౌలు రైతుకు కార్డు అందేలా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బి.వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

సారాను విడనాడి సగౌరవంగా జీవించాలి

నూజివీడు, మే 15 (ఆంధ్రజ్యోతి):సారాను విడనాడి సమాజంలో సగౌరవంగా జీవించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య అన్నారు. గురువారం నూజివీడు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నవోదయం-2పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారా తయారీ, క్రయ,విక్రయాలు చట్టరీత్యా నేరమని, ప్రభుత్వం సారాపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. నవోదయం -2 కార్యక్రమంలో భాగంగా విస్తృత దాడులు నిర్వహిస్తున్నామన్నారు. సారా తయారీ విడనాడిన వారికి సంబంధించి ప్రత్యేకంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక పథకాలు రూపొందించినట్లు తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ అనిత మాట్లాడుతూ వాస్తవాలు గ్రహించి, క్రమశిక్షణతో జీవించాలనుకునే వారికి ఉపాధి అవకాశాల్లో శిక్షణ ఇచ్చి, కుటుంబ ఆర్థిక పురోభివృద్ధి సాధించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. కైకలూరు, నూజివీడు ఎక్సైజ్ సీఐలు రమేష్, ఎ.మస్తానయ్య, ఏరియా కో-ఆర్డినేటర్ సురేంద్ర, సుమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ముసునూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ముసునూరు గ్రామ శివారు శ్మశానవాటిక వద్ద ఉన్న మలుపులో గురువారం రాత్రి పొగాకు దుత్తల లోడ్ ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు రక్తపు గాయాలయ్యాయి. గోపవరం నుంచి దుత్తలు లోడ్ చేసుకుని చెక్కపల్లి వైపు వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. వెంటనే డ్రైవర్ ఇంజిన్‌పై నుంచి దూకడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన డ్రైవర్‌ను ముసునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



బోల్తా కొట్టిన ట్రాక్టర్

మామిడిపై పండు ఈగ దాడి

దీనివల్లే 30 శాతం పంట నష్టం

కొనేవారు లేక కుదేలైన రైతులు

ప్రతికూల వాతావరణంతో మరింత నష్టం

నూజివీడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మేడిపండు చూడ మేలిమై ఉండు, పొట్టవిప్పి చూడ పురుగులుండు అన్నచందాన ప్రస్తుతం మామిడి పరిస్థితి తయారైంది. కొన్ని సంవత్సరాల క్రితం తైవాన్ జామద్వారా వ్యాప్తి చెందిన పండు ఈగ దెబ్బకి తైవాన్ జామ తోటలు మాయం కాగా గతేడాది నుంచి మామిడి పండుపై ఈ పండు ఈగ దాడితో మామిడి రైతులు కునారిల్లుతున్నారు. మామిడి కాయ చెట్టుపై తయారైన తరువాత ఈ ఈగ దాడితో ఇటు మామిడి రైతుకు, అటు కొనుగోలు దారులకు తీవ్రనష్టం జరుగుతోంది. ఈ పండు ఈగ తైవాన్ జామ, మామిడిపైనే కాదు, బొప్పాయి, సపోట, అరటి, సీతాఫలం, సిట్రస్ ఫలాలు పైన, అలాగే పొట్ల, బీర, సొర, కాకర కాయవంటి కూరగాయలను సైతం ఆశిస్తూ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఈ పురుగు ఆశించిన ఏ పంట, కూరగాయ అయినా పైకి చూడటానికి బాగానే ఉంటుంది. వాటిని కొన్నప్పుడే లోపల పురుగులు కనిపిస్తాయి.





కాయల రక్షణకు కవర్ తొడిగిన దృశ్యం

కాయపై దాడి ఇలా..

మామిడిచెట్టుపై మామిడి పండు తయారు కాగానే ఈ పండు ఈగ కాయపై వాలి తన వెనుక భాగాన ఉన్న ఒక ముల్లువంటి భాగాన్ని కాయలోకి చొప్పించి ఒకేసారి రూ.500 వరకు గుడ్లు పెడుతుంది. కాయపై పరీక్షగా చూస్తూనే తప్ప ఈ ఈగ పెట్టిన సన్నని రంధ్రాలు కని పించవు. సాధారణ ఉష్ణోగ్రతలో మామిడి కాయలోకి వెళ్ళిన గుడ్లు ఒక్కరోజులోనే పగిలి చాలా చిన్నచిన్న పురుగులుగా బయట పడ తాయి. ఈ కాయలోని తీపి కండపదార్థాన్ని తిని పెరిగి బియ్యం గింజలు లాగా తయారవుతాయి. అవి విసర్జించే మలిన పదార్థాలపై కాయపై పెట్టిన సన్నని రంధ్రాల ద్వారా బయట నుంచి శిలీంద్రాలు కాయలోనికి ప్రవేశించి కాయను కుళ్లి మెత్తబడేటట్లు చేస్తాయి. ఈ పురుగులు కాయలో లార్వాలుగా వృద్ధి చెందు తాయి. పండు పూర్తిగా చెడిపోయి చెట్టు నుంచి నేలపై పడటం ద్వారాను, కాయ మార్కెట్లోకి వెళ్ళినప్పుడు వినియోగదారుడు కొని ఉపయోగించటానికి ప్రయత్నించినప్పుడు లోన పురుగులు కనిపించి బయట పారేయడంతో అక్కడ ఇవి లార్వాలుగా మారి భూమిపై చేరి పది, 12 రోజుల్లో తిరిగి అవి ఈగలుగా మారతాయి. ఈ ఈగలు ఆడ, మగ సంపర్కం జరిపి మళ్ళీ ఆడ ఈగలు మామిడి కాయలు లేదా కూరగాయల పై చేరి గుడ్లు పెడుతూ తన సంతతిని వృద్ధి చెందిస్తాయి. 40 నుంచి 50 రోజుల్లో తన జీవిత చక్రంను పూర్తి చేసుకుని రైతులు పుట్టుముం చుతున్నాయి. ఈ పండు ఈగ 50 నుంచి 100 కిమీ వరకు పయనిస్తూ తన విధ్వంసాన్ని కొనసాగిస్తోంది. ఈ పురుగు ఆశించిన మామిడి పండ్లు వేరే ప్రాంతాలకు వెళ్ళినప్పుడు అక్కడ కూడా అవి తన సంతతిని వృద్ధిచేస్తూ అపార నష్టం కలిగిస్తుంటాయి. గత పదిరోజుల నుంచి అకాల వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మామిడి పంటకు తీవ్రనష్టం జరుగుతోంది. దానికితోడు ఈ ఈగ ఆశించడంతో చెట్లు పసుపురంగు వచ్చి చెట్టు నుంచి కిందపడి పోతున్నాయి. మార్కెట్లో మామిడి కాయలను కొనే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రభుత్వం దృష్టి సారించాలి

మామిడి ఎదుర్కొంటున్న ఈ పరిస్థితి ఒక్క నూజివీడు ప్రాంతంలోనే కాదు. మామిడి పంట పండుతున్న ప్రతి ప్రాంతంలోనూ ఈ పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు ఈ పంట ఇతర పండ్లు, పండ్ల రకాలకు, కూరగాయలకు సైతం సోకుతూ రైతులను ఆందోళన పరుస్తోంది.వీటి నివారణకు శాస్త్రవేత్తలు వలలు సూచించారు. అయితే ఈ వలలో కేవలం మొగ ఈగ మాత్రమే పడుతుంది. ఆడ ఈగలు ఈ వలలోకి రావని స్పష్టంగా తేలింది. దానివల్ల ఈగను అదుపుచేయడం సాధ్యం కావడం లేదు. అలాగే మామిడి కాయపైన కవర్లు చుట్టమని సూచిం చారు. మామిడి చెట్టుపై ఉన్న కాయలు అన్నింటికి ఈ కవర్లు తొడగడం సాధ్యం కాదు.

మామిడి పరిశోధనా కేంద్రాన్ని ఉపయోగించాలి

నూజివీడులో ఉన్న మామిడి పరిశోధనా కేంద్రానికి వెంటనే భూమి కేటాయించి మామిడి పై వస్తున్న ఇబ్బందులపైన, ఈ పండు ఈగ అరికట్టే విధానంపైన త్వరితగతిన పరిశోధనలు చేయించాలి.ఇప్పటికే వేలాది ఎకరాల తోటలను తొలగిస్తున్నారు. ఈ ఏడాది ఈ పండు ఈగ దెబ్బకు పరిస్థితి పూర్తిగా తలకిందలు కావడంతో మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ప్రభుత్వం ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మామిడి పంటను పరి రక్షించే విధంపై దృష్టి సారించాలని మామిడి రైతులు కోరుతున్నారు.

ప్రజ్ఞ శిక్షణ తరగతులు ముగింపు

కైకలూరు, మే 15(ఆంధ్రజ్యోతి): యువతకు సంస్కృతి, సంప్రదాయలపై వికాస తరంగిణి అధ్యక్షురాలు చిట్టి హేమలత అవగాహన కల్పించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న ప్రజ్ఞ వేసవి శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు వికాస తరంగిణి ప్రజ్ఞ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సభ్యులు విజయలక్ష్మి, నారగాని శ్యామల, సత్యవతి, గూడురు భవాని, చైతన్య రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వార్లకోడు సరిహద్దులు నిర్ధారణ

కైకలూరు, మే 15(ఆంధ్రజ్యోతి): కైకలూరు పట్టణంలోని ప్రధాన డ్రెయిన్ వార్లకోడు సరిహద్దులను తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం నిర్ధారించారు. గ్రామసర్వేయర్లతో కలిసి గురువారం కాలువ మార్కింగ్ ఏర్పాటుచేశారు. ఆక్రమణలు, ఇతర ఫిర్యాదుల మేరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రెయినేజీ ఏఈ రామకృష్ణ, వీఆర్వోలు కృష్ణ, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులు కుటుంబ సర్వేలో నమోదు కావాలి

ముదినేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేలో ఉన్న రైతులకే అన్నదాత సుఖీభవ పథకం ప్రయోజనం వర్తిస్తుందని ఏవో బి.వేణుగమాధవ్ తెలిపారు. రైతు సేవా కేంద్రంలో రైతుల నమోదు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. కుటుంబ సర్వేలో పేర్లు లేని వారు వెంటనే నమోదు చేయించుకోవాలని ఏవో సూచించారు. ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

ముమ్మరంగా సాగుతున్న ఉపాధి పనులు

కలిదిండి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉపాధి కూలీలకు 100 రోజులు పని దినాలు కల్పిస్తూ వేతనాలను బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు. వేసవిలో వలస వెళ్లకుండా సొంత గ్రామాల్లో కూలీలను ఉపాధి పనులు ఆదుకుంటున్నాయి. కాల్వల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు. శివారు గ్రామాల వరకు తాగునీరు సరఫరా అవుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువకుడి మృతదేహం ఆచూకీ లభ్యం

కైకలూరు, మే 15(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని యువకుని మృతిపై ఆధారాలు లభ్యమైనట్లు టౌన్ సీఐ పి.కృష్ణ గురువారం తెలిపారు. ఆచవరంలో బుధవారం గుర్తు తెలియని యువకుడు మృతి చెందడంతో విచారణలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన గుండరాల దుర్గాప్రసాద్(26)గా గుర్తించినట్లు సీఐ తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఆలయ నిర్మాణానికి మరొకరితో కలిసి కొద్దిరోజులు క్రితం వెళ్లాడు. అనారోగ్యానికి గురవడంతో స్వగ్రామానికి సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం రాత్రి బయల్దేరాడు. మార్గమధ్యలో కైకలూరులో రైలు దిగి ఒక సెల్‌ఫోన్ దుకాణంలో బ్యాగును, సెల్‌ఫోన్ ఉంచి వెళ్లాడు. కైకలూరు నుంచి ఆచవరం వైపు వెళ్లి ఖాళీ స్థలంలో దుర్గాప్రసాద్ మృతి చెందాడు. బుధవారం రాత్రికి సెల్‌ఫోన్ షాపు మూసివేసే సమయానికి కూడా అతను రాకపోవడంతో మృతుని బ్యాగ్ పరిశీలించి సెల్‌ఫోన్ గుర్తించారు. దుకాణదారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గురువారం మృతదేహాన్ని అతని సోదరుడు గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదుచేసి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు సీఐ తెలిపారు.

చేతులు జోడించి అడుగుతున్నాం సమస్యలు పరిష్కరించండి

అధికారుల తీరుపై మునిసిపల్ కౌన్సిలర్ల ఆగ్రహం



అధికారుల తీరుపై ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ సత్యనారాయణ (ఇన్‌సెట్‌లో) చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ

నూజివీడు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): 'చేతులు జోడించి అడుగుతున్నాం పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టండి' అంటూ నూజివీడు మున్సిపల్ కౌన్సిలర్లు అధికారుల తీరుపై తీవ్ర నిరసన తెలిపారు. గురువారం నూజివీడు మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార ప్రతిపక్షసభ్యులు ఏకమై అధికారుల తీరుపై ప్రశ్నలవర్షం కురిపించారు. మున్సిపల్ సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా, ఎందుకు రావడం లేదని అంటే మున్సిపాల్టీలో ఉన్న సమస్యలు ఆయా శాఖలకు సంబంధం లేదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి రాకపోవడంపై గతంలోనే కలెక్టర్‌కు సమాచారం ఇచ్చామని, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా రాతపూర్వ కంగా కలెక్టర్, నూజివీడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్‌కు సూచించారు.

మంత్రి హాజరవుతారనడంతో వాయిదా..

గత నెలలో మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించకపోవడం, రెండు నెలలకు సంబంధించిన ప్రతిపాదనలు ఒకేసారి కౌన్సిల్ ముందుకు తీసుకురావడంపై కౌన్సిలర్లు అసహ నం వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ అధికా రులు వివరణ ఇస్తూ మంత్రి కొలుసు పార్థసారథి కౌన్సిల్ సమావేశానికి హాజరవుతారంటూ పేర్కొనడంతో ఆయన షెడ్యూల్ కోసం ప్రయ త్నించామన్నారు. దీనితో గతనెలలో సమావేశం నిర్వహించ లేకపోయామనడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రమంత్రిగా అనేక పనులు ఉంటాయని, ఆ నెపాన్ని మంత్రిపై వేయడం తగదంటూ కౌన్సిలర్లు పేర్కొన్నారు. నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



జనార్దనవరంలో పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేస్తున్న డైరెక్టర్

నూతన వధూవరులకు బంగారు నాణేలు అందజేత

చాట్రాయి, మే 15(ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద మండలంలో ఇద్దరు పెండ్లి కుమార్తెలు, నలుగురు పెండ్లి కుమారులకు వేర్వేరుచోట్ల గురువారం డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి బంగారు నాణేలు అందజేశారు. పాల ఉత్పత్తిదారులు జనార్ధనవరంలో ఎం.రాధాకృష్ణ కుమార్తె భూమిక, మర్లపాలెంలో సీహెచ్ రాధాకృష్ణ కుమారుడు శ్రీనాథ్, కొత్తగూడెంలో పామర్తి నాగరాజు కుమారుడు మహేష్, కె.కొత్తగూడెంలో చల్లగుళ్ళ కృష్ణకుమారి కుమారుడు దిలీప్, చల్లగుళ్ళ లక్ష్మి కుమారుడు మనోజ్‌కుమార్, బూరుగూడెంలో జి.అరుణకుమారి కూతురు ప్రజ్ఞ వివాహాలు సందర్భంగా ఒక్కొక్కరికి రూ.20 వేలు విలువైన బంగారు నాణేలు అందజేశారు. సంఘాల అధ్యక్షులు, పాల రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

సిపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చాట్రాయి, మే 15(ఆంధ్రజ్యోతి): సిపెట్ డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) విజయవాడలో పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల వ్యవధి గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ అనే మూడు కోర్సులకై ఆన్‌లైన్ విధానంలో ఈనెల 29లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కోర్సులకు ఏపీ ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ ఉందని, ఇతర వివరాలకు డాక్టర్ పి.శివన్నారాయణ 94942 59006కు సంప్రదించాలని అన్నారు.



రావిచర్ల గ్రామ టీడీపీ కార్యవర్గ సభ్యులు

టీడీపీ రావిచర్ల గ్రామ అధ్యక్షుడిగా మురళీమోహన్

నూజివీడు టౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): రావిచర్ల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా లావు మురళీమోహన్ ఎన్నికయ్యారు. గురువారం గ్రామంలో సమావేశం నిర్వహించి, టీడీపీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ ఉపాధ్యక్షుడిగా కొలుసు రామారావు, ప్రధాన కార్యదర్శిగా దేవరపల్లి డేవిడ్‌రాజు, కార్యనిర్వాహక కార్యదర్శు లుగా కొలకలూరి బాలరాజు, కృష్ణకుమారి, మరియమ్మ, కార్యదర్శులుగా నాగూర్‌భాష, వెనిగళ్ల వాసం నాగేశ్వరరావు, దాసరి గురవయ్య, కోశాధికారిగా కె.నాగబాబులు ఎన్నిక అయ్యారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో పోలవరం విద్యార్థి ప్రతిభ



చాట్రాయి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి అడ్మిషన్ల కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో పోలవరం కోనేరు కాలనీ పాఠశాల విద్యార్థి కొండవరద రిష్యేంద్రకృష్ణ 100కు 84 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 630 ర్యాంకు సాధించాడు. రిష్యేంద్ర కృష్ణ తండ్రి ఏసుబాబు ఆర్‌ఎంపీ డాక్టర్‌గా, తల్లి చంద్రకళ చాట్రాయి సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తున్నారు. రిష్యేంద్ర కృష్ణను, తల్లిదండ్రులను హెచ్ఎం ఆర్.నాగేశ్వరరావు, గ్రామ ప్రముఖులు మరిడి చిట్టిబాబు, యర్రా హేమంత కుమార్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ బి.శ్రీనివాసరావు పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పి.రామకృష్ణ అభినందించారు.

బీసీ మైనార్టీలకు సబ్సిడీపై రుణాలు

ఆగిరిపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండలంలోని బీసీ మైనార్టీల సబ్సిడీపై రుణాలకు ఈనెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఆనందబాబు గురువారం తెలిపారు. బీసీ - ఈ మైనార్టీ, బీసీ-సిక్రిస్టియన్ మైనార్టీల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

కారును తప్పించబోయి బోల్తా కొట్టిన లారీ

తృటిలో తప్పిన ప్రమాదం

నూజివీడు టౌన్,మే 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలోని పోతురెడ్డిపల్లి అడ్డరోడ్డు వద్ద లారీ బోల్తా కొట్టింది. కోడిగుడ్ల లోడుతో బైపాస్‌లో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి పోతురెడ్డిపల్లి అడ్డరోడ్డువైపు బోల్తా కొట్టింది. అడ్డరోడ్డు వద్ద సోడాల బండి ఉండడం. అక్కడ సోడా తాగేందుకు ఆగిన ఆటోపై లారీ మీద కొట్టింది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లు అయింది.

